

హైదరాబాద్ వార్త

# ఎస్ఎస్‌సి, ఇంటర్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలి

### జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ అనుదీప్, డిఈవో రోహిణి తదితరులు

**హైదరాబాద్, జనవరి 29,ప్రభాతవార్త:** ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో జిల్లాలకు మెరుగైనఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అందుకు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈమేరకు బుధవారం బంజారాహిల్స్ లోని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో పదవ తరగతి, ఇంటర్మీడియేట్‌లో ఉత్తీర్ణత శాతం పెంపు పై ప్రధానోపాధ్యాయులతో కలిసి ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురి శెట్టితో కలసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భం గా మంత్రి మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు జీవితంలో తొలిమెట్టని ప్రతి విద్యార్థి ఉత్తీర్ణతే లక్ష్యం గా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. ఎస్ఎస్సి, ఇంటర్మీడియేట్‌లో మెరుగైన ఫలితాలు సాధించేవిధంగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. టీచర్ల కొరత పూర్తిచేసామని అలాగే అన్ని సబ్జెక్ట్స్‌లకు టీచర్స్ ఉన్నారని అన్నా రన్నారు. అన్ని పాఠశాలలో మౌలిక సదుపాయలు కల్పించామని, పిల్లల్లో పరీక్షల భయం ఉండ కుండా స్లిప్ టెస్ట్, గత ప్రశ్న పత్రాలపై పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ప్రతి విద్యార్థి లో మాట్లాడే గలిగే, మెరుగ్గా రాయగలిగే, సమస్య వస్తే ధైర్యంగా ఎదుర్కొనే పుణ్యాలను విద్యార్థు లలో పెంపొందించాలని అన్నారు. హైదరాబాద్ జిల్లాను ఎస్ఎస్సి ఇంటర్మీడియట్ పరీక్షలలో టాప్ లో ఉండేలా చూడాలని అలా పనిచేసిన ఉపా ధ్యాయులకు 15 ఆగస్టున అవార్డు ఇచ్చి సన్మా నించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఏ సబ్జెక్టు లలో వెనుకబడి ఉన్నారో గుర్తించి వారికి ప్రత్యేక శ్రద్ధ చూపించి మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. అలాగే విద్యా పరమైన అంశాలపై సమావేశం ఏర్పాటు చేయా లని డిఈఓను ఆదేశించారు. గత సంవత్సరంలో జిల్లాలో పదవతరగతి ఎస్ఎస్సి, ఇంటర్మీడియట్ శాతం, ఈ సంవత్సరంలో ఉత్తీర్ణత శాతం పెరిగేందుకు అధికారులు తీసుకున్న చర్యలపై మండలాల వారీగా సమీక్షించారు.

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లాలో గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం మెరుగైన ఫలితాల సాధనకు ప్రత్యేక కృషి చేయాలన్నారు. అన్ని పాఠశాలలో ఎక్కడా సబ్జెక్ట్ టీచర్ల కొరత లేదని మాథ్స్, సైన్స్ సబ్జెక్ట్స్ లలో వెనుకంజలో ఉన్న పిల్లలకు ప్రత్యేక బోధన కల్పించాలని సూచించారు. ఏమైనా లోటుపాట్లు, సమస్యలు ఉంటే వెంటనే తెలియజేయాలని ప్రధా నోపాధ్యాయులకు సూచించారు. ఈ సమావేశం లో డిఆర్ఓ ఈ.వెంకటాచారి, డిఈఓ రోహిణి, డిఐఈఓ ఒడ్డెన్న, ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టీ సం క్షేమ అధికారులు కోటాజీ, ఆశన్న, ఇలియాస్ అహ్మద్, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాలు, కళా శాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# హెల్త్ ప్రొఫైల్‌కు ఏఐ ఆధారిత యాప్ దోహదం

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు





సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్‌బాబు, మహేష్‌కుమార్‌గౌడ్, కృష్ణప్రసాద్ తదితరులు

**హైదరాబాద్, జనవరి 29,ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రతి పౌరుని హెల్త్ ప్రొఫైల్‌ను రూపొందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిం దని, ఇందుకోసం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఎఐ) ఆధారిత మొబైల్ యాప్ వెబ్ దోహదపడతాయని రాష్ట్ర ఐటి, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఈమేరకు బుధవారం జరిగిన హైదరాబాద్ మాడ్యూర్ హస్పిటల్ సర్వీసెస్ రూపొందించిన ఎండిఆర్.మై డిజి రికార్డ్ మొబైల్ యాప్‌ను పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌తోకలిసి మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సంద ర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని తెలుసుకోవడానికి ఎఐ ఆధారిత మొబైల్ యాప్ రూపొందించడం అభినందనీయమన్నారు. ప్రస్తు తం ఒక ఆసుపత్రిలో చికిత్స పొందిన వ్యాధిగ్ర స్తుడు మెరుగైన వైద్య సదుపాయాలు, చికిత్స కోసం తన వ్యాధికి సంబంధించిన వివరాలతో మరో ఆసుపత్రికి వెళ్లి సంబంధిత ఆసుపత్రి రోగి వ్యాధి కి సంబంధించిన వివరాలను విశ్వసించడంలేద న్నారు. ఫలితంగా మరోసారి ఆ వ్యాధిగ్రస్తునికి మళ్ళీ అన్ని వైద్య పరీక్షలు చేయడం వల్ల రోగి మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నా డన్నారు. ఇలాంటి పరిస్థితిని నివారించడానికి, ఏ ఆసుపత్రికి వెళ్లినా ప్రజలకు సంబంధించిన ఆరోగ్య వివరాలు విశ్వసనీయంగా, అందుబాటులో ఉండే విధంగా ప్రజల సమగ్ర ఆరోగ్య సమాచా రాన్ని రూపొందించాలని ప్రభుత్వం భావిస్తుంద న్నారు. ఎఐ ఆధారిత మొబైల్ యాప్ ద్వారా ఒక వ్యక్తి పూర్తి రక్తపోటు, మధుమేహ, తదితర ఆరోగ్య వివరాలను వెంటనే తెలియజేయడం ద్వారా రోగికి మెరుగైన చికిత్సను అందించడంతో పాటు అతనికి ఆర్థికంగా వెసులుబాటు కలుగుతుంద న్నారు. మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యరంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అందులో భాగంగానే ఇటీవల దావోస్ జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో మొత్తం రూ.1.78 లక్షల కోట్ల పెట్టు బడుల ప్రతిపాదనలు వచ్చాయని, ఇందులో పలు వైద్యరంగ సంస్థలు ప్రభుత్వంతో అవగాహన ఒప్పం దాలు చేసుకున్నాయని వివరించారు. చైర్మన్ మోటూరి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఒక వ్యక్తి ముఖం లేదా శరీర అవయవాలను కేవలం 45 సెకండ్లపాటు పరిశీలించి ఆ వ్యక్తికి సంబంధించిన పూర్తి ఆరోగ్య సమాచారాన్ని తెలియజేసే విధంగా ఎండిఆర్.మై డిజి రాకార్డ్ యాప్ రూపొందించి నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సిఈఓ డాక్టర్ సరోజ్‌గుప్తా, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ డాక్టర్ క్రిస్ హాంప్రయ్స్, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి శ్రీధర్ బాబుకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న సంతోష్‌రెడ్డి

## మంత్రి శ్రీధర్‌బాబుకు సన్మానం

**నాచారం, జనవరి 29 ప్రభాతవార్త :** మాజీ సైనికుడు, యూత్ కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శి సంతోష్ రెడ్డి,మంత్రి శ్రీధర్ బాబును మాస్టర్ మైండ్స్ స్కూల్స్ అధినేతలు విదేశాల్లో పర్యటించిన మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. మాస్టర్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ అధినేతలు సుధాకరరెడ్డి, హరిబ్రహ్మం, రామకృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, అభిజిత్, భానుప్రకాష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించినట్లు తెలిపారు. విదేశీ పర్యటనలో అనేక ముఖ్యమైన కంపెనీ లతోఒప్పందాలు కుదుర్చుకుని, రాష్ట్ర అభివృద్ధికి మంత్రి శ్రీధర్ బాబు కృషి చేయడం గర్వకారణం అన్నారు. విదేశీ పర్యటనలో భాగంగా మొత్తం 1,78,950 కోట్ల పెట్టుబడుల ను తెలంగాణ రాష్ట్రానికి ఆకర్షిం చడమే కాకుండా 49,500 ఉద్యోగాల భరోసాను కూడా సాధించారని మంత్రి శ్రీధర్ బాబును కొనియాడారు. ఈ పెట్టుబడుల ద్వారా తెలంగాణ రాష్ట్రం ప్రపంచ ఆర్థిక ప్రాధాన్యత కలిగిన అగ్రరాజ్యాలలో బహుళ జాతి కంపెనీల తో భాగ స్వామ్యం గా మారింది అన్నారు. మంత్రి స్వరాష్ట్రానికి తిరిగి వచ్చిన సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి, ఈ ఘనతను అభినందిస్తూ సత్కరించామని అన్నారు.

## కంటోన్మెంట్ ఉన్నతాధికారులతో ఎంపి ఈటల బేటీ

**కంటోన్మెంట్, జనవరి 29 ప్రభాతవార్త:**





కంటోన్మెంట్ ఉన్నతాధికారులతో బేటీ అయిన ఎంపీ ఈటెల రాజేందర్

కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డుకు రక్షణ శాఖ స్థలాలు, భూ బదలాయింపుపై మంజూరైన 3 కోట్ల నిధులపై, సికింద్రా బాద్ ప్యాట్నీ, జెబిఎస్ నుంచి శామీర్‌పేట్,మేడ్చల్ వరకు చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాలపై బుధవారం మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షులు నంజున్‌దీశ్వర్, సిఈఓ మధుకర్ నాయక్‌లతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షురాలు బానుక నర్మదలు పాల్గొన్నారు.

## తెలుగు సినిమా పాటల రారాజు వేటూరి

### -ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం

**చిక్కడపల్లి, జనవరి 29ప్రభాతవార్త:** తెలుగు చిత్రపరిశ్రమైన ఐదువేలకు పైగా పాటలు రాసిన ఏకైక పాటల రచయిత వేటూరి సుందరరామమూర్తి అని ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం అన్నారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ – కిన్నెర కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యం లో ప్రముఖ సినీగేయరచయిత వేటూరి సుందరరామమూర్తి జయంతి సందర్భంగా ప్రముఖ అంతర్జాతీయ గాయనీ శారదా సాయి బృందంచే సినీసంగీత విభావరి కార్యక్రమం బుధవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగ రాయ గానసభలోని నిర్వాహక సంస్థ అధినేత మద్దాళి రఘురామ్ నిర్వ హణలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ వేటూరి వంశమే సాహిత్య నేపథ్యం ఉన్నవారని, పద్యంపై సాధికారత సాధించిన వ్యక్తి వేటూరికే దక్కుతుందన్నారు. వేటూరి రాసిన పాటలు 'కొమ్మ కొమ్మకో సన్నాయి' రాగాన్ని పాడిస్తాయి. రాలిపోయే పువ్వు తో ఆయన రాతలు రాగాలు తీయిస్తాయని, శ్రీశ్రీ తర్వాత తెలుగు భాషకు అంతర్జాతీయ కీర్తి తీసుకొచ్చిన గొప్ప కవి వేటూరి అని అన్నారు. తెలుగు పాటను విశ్వవ్యాప్తం చేసిన దిట్ట అని, ముందు వేటూరికి తర్వాత అనే స్థాయికి తెలుగు పాటను తీసుకువచ్చిన పాటల శ్రామికుడు అని అన్నారు. ఆయనకు అతిస్వల్ప వ్యవధిలో పాటలు రాసే నేర్పరి అని పేరు కూడా ఉందన్నారు. వేల పాటలు రాసిన రచయిత మనకు చిత్ర పరిశ్రమలో కని పించరన్నారు. సరస్వతి అంశ వేటూరి అని అన్నారు. హాజరై గాయనీ గాయకు లను సత్కరించి అభినందించారు. గాయనీ గాయకులు సినీనేపథ్య, అంతర్జాతీయ గాయకుడు కృష్ణప్రసాద్, మధురగాయక మయూఖ రేణుక రమేశ్, కంటి వైద్యనిపుణురాలు డాక్టర్ ఎం.హిమబిందు, గాయకులు ఆనంద్, తిరుపతిరెడ్డి, ఎస్.ఇందిర తదితరులు అద్భుతంగా గానం చేశారు.



గాయనీ గాయకులను సత్కరించిన దృశ్యం

# మెట్రో సేవలకు అంతరాయం

### సుమారు 2 గంటలపాటు నిలిచిన రైళ్లు

**హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:** హైదరాబాద్ మెట్రో సేవలు బుధవారం కొద్దిగంటలపాటు స్తంభించాయి. సాంకేతిక కారణాలతో నాగోలు రాయదుర్గం రూట్‌లోని మెట్రో సేవలు దాదాపు రెండు గంటల పాటు నిలిచి పోయాయి. అమీర్‌పేట నుంచి హైటెక్ సిటీ, నాగోలు నుంచి సికింద్రాబాద్, మియాపూర్ నుంచి అమీర్‌పేట మధ్య మెట్రో రైళ్లు ఆగిపోయాయి. సాంకేతిక కారణాలతో ఆయా మార్గాల్లో మెట్రో రైళ్లు ఆలస్యంగా నడిచాయి దీంతో ఉదయం సమయం కావడంతో ఆఫీసులకు వెళ్లే ప్రయాణికులతో మెట్రో స్టేషన్లు రద్దీగా మారాయి. దీంతో పలుస్టేషన్లలో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆతర్వాత కొద్దిసేపటికే సేవలు పునరుద్ధరించడంతో ప్రయా ణికులు ఆఫీసులబాట పట్టారు.

## స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

### -బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్‌గౌడ్

**హైదరాబాద్, జనవరి 29,ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించినట్లుగా పార్లమెంట్ పక్ష నేత రాహుల్ గాంధీ, సిఎం రేవంత్ రెడ్డి సామాజిక న్యాయ సాధన ఆలోచన మేరకు స్థానిక సంస్థల్లో బీసీలకు 42 రిజర్వేషన్లు కల్పించాలని కామారెడ్డి డిక్లరేషన్ ను అమలు చేయాలని బిసి సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్‌గౌడ్ టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను విజ్ఞప్తి చేశారు. ఈమేరకు బుధవారం హైదర్ గూడ ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ లో పిసిసిచీఫ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్స్ టీచర్లు ఎన్నికల్లో బీసీ అభ్యర్థులకు టికెట్స్ కేటాయించాలన్నారు. అలాగే మహాత్మా జ్యోతిరావు పూలే ఓవర్సీస్ స్కీం గత ప్రభుత్వం నుంచి పెండింగ్ లో ఉన్న నిధులు వెంటనే విడుదల చెయ్యాలని బీసీ విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్షిప్స్ పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. అంతేకాకుండా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కాంట్రాక్టుల్లో 42 బీసీ లాకు కేటాంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పేదల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు గిరగాని భిక్షపతి గౌడ్, టిబిసిసిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్ర శ్రీహరి గౌడ్, రాష్ట్ర కార్యదర్శి తౌటం సత్యంనేత, మహేష్ ముదిరాజ్ ,రాకేష్ యాదవ్ , అభిషేక్ పటేల్, సలీమ్ పైల్మాన్, లక్ష్మి ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.



పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న నరేందర్‌గౌడ్



రక్షణ శాఖ స్థలాల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న కంటోన్మెంట్ బోర్డు ఇంజనీర్లు

## స్థలాలను కబ్జా చేస్తే సహించేది లేదు

### సిఓ మధుకర్ నాయక్

### కోర్టు ఆదేశాలతో నేల మట్టం చేసిన బోర్డు అధికారులు

**కంటోన్మెంట్,జనవరి 29 ప్రభాతవార్త:** రక్షణ శాఖ, కంటోన్మెంట్ బోర్డు స్థలాలను కబ్జా చేస్తే ఎంతటి వారినైనా సహించేదిలేదని కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్ హెచ్చరించారు. బోయిన్‌పల్లిలోని చందనా గార్డెన్ ఎదురుగా ఉన్న 3.30 ఎకరాల రక్షణ శాఖ,ఓల్డ్ గ్రాండ్స్ 190 బంగ్లా చుట్టు ప్రక్కల ఉన్న ఖాళీ స్థలాలను కొందరు వ్యక్తులు ప్లాట్లుగా తయారు చేసుకొని ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ విషయంపై కోర్టును ఆశ్రయించగా ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి, కంటోన్మెంట్ బోర్డుకు అనుకూలంగా తీర్పురావడంతో బుధవారం ఆ స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణాలను, కేబుల్ వైర్లును, రాజీవ్ గాంధీ అవియేషన్, అకాడమీ పేరుతో కొనసాగుతున్న విద్యా సంస్థను కూల్చివేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు ఇంజనీర్లు సి.హెచ్.ఉమా శంకర్, ఫనికుమార్, దినేశ్,సాగర్,తరుణ్ రెడ్డి, తిరుమలగిరి తహశీల్దార్ అశోక్ కుమార్, బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మి నారాయణ రెడ్డి, డిఫెన్స్ ఎస్టేట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమానికి హాజరై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను రాజేంద్రనగర్ సీనియర్ నాయకులు ఇంద్రపాల్ రెడ్డి సన్మానిస్తున్న దృశ్యం

## చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర ముఠా అరెస్టు

**నేరేడ్‌మెట్, జనవరి 29 ప్రభాతవార్త :** వృద్ధులు, మధ్య వయస్కులైన మహిళలను లక్ష్యంగా చేసుకుని పలుమార్లు చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర ముఠాను అరెస్టు చేసినట్లు రాచకొండ పోలీసులు పేర్కొన్నారు. పోలీసులు కథనం ప్రకారం... మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గుండ్ల పోచంపల్లి సరస్వతి నగర్‌కు చెందిన గుజరాతి కిషన్ (24), ఢిల్లీ తామతార్ కాలనీకి చెందిన రామ్ లాల్ (43), ఢిల్లీ సుల్తాన్‌పురం ప్రాంతానికి చెందిన శ్యామ్ లాల్ (30), ఢిల్లీ బేగంపూర్ రాజీవ్ నగర్ కు చెందిన కోలి (50), ఢిల్లీకి చెందిన నితిన్ (14) లు కలసి సులభంగా డబ్బు సంపాదించాలనే నిర్ణయంతో గుర్తుతెలియని వ్యక్తులతో పరిచయం చేసుకొని మొదట నితిన్ అనే యువకుడు తమ వద్ద డబ్బు ఉందని బంగారం ఆభరణాలు తీసుకొని డబ్బు ఇస్తామని వారికి ఆశ చూపి అనంతరం వారికి నకిలీ నోట్లో నుంచి బంగారాభరణాలను దోచుకు వెళ్లే వాళ్ళని తెలిపారు. గతంలో రాచకొండ పోలీస్ కమిషనర్ పరిధిలో భువనగిరి, హుస్సేన్ ఆలం, దుండిగల్, జీడిమెట్ల, ఎస్సార్ నగర్, అఫ్జల్ గంజ్ తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ ముఠలకు పాల్పడినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రత్యేక బృందావనం ఏర్పాటుచేసి వారిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. వారి వద్ద నుంచి ఏడు బంగారు గొలుసులు దాదాపు 17 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.

## విదేశీ యువతులతో వ్యభిచారం

### 9 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

**గచ్చిబౌలి, జనవరి 29 ప్రభాతవార్త :** విదేశాల నుంచి యువతులను తీసుకువచ్చి గచ్చిబౌలి టిఎన్‌జిఓ కాలనీలో వారితో వ్యభిచారం చేయిస్తున్న ముఠా గుట్టు రట్టయ్యింది. మంగళవారం రా త్రి ఎస్ఓటీ పోలీసులు, గచ్చిబౌలి పోలీసులు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ పోలీసులతోకలిసి వ్యభిచార గృహం మీద దాడులు నిర్వహించి 9 మంది విదేశీ యువతులను రెస్క్యూ చేశారు. వీరితో పాటు ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేయగా, నిర్వాహకులు పరారయ్యారు. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... గచ్చిబౌలి ఐటి కారిడార్ పరిధిలోని టిఎన్‌జిఓ కాలనీలోగల జివిఆర్ నివాస్ ప్లాట్ నెంబరు 304ను కొన్ని రోజుల క్రితం ఓ వ్యక్తి అద్దెకు తీసుకున్నాడు. అద్దెకు తీసుకున్న ఈ ప్లాట్‌లో పలు దేశాల నుంచి యువతులను తీసుకువచ్చి వ్యభిచారం చేయిస్తున్నాడు. కెన్యా,టాంజానియా తదితర దేశాలనుంచి యువతులను తీసుకువచ్చి టిఎన్‌జిఓ కాలనీలో ఉంచి వ్యభిచారం కొనసాగిస్తున్నారు. కాగా ఈ వ్యభిచారగృహంపై సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు, ఎస్ఓటీ పోలీసులు హ్యూమన్ ట్రాఫికింగ్ పోలీసులతో కలిసి మంగళవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సదరు ప్లాట్‌లో ఉన్న విదేశీ యువతులు 9మందిని అక్కడి నుంచి రెస్క్యూ చేసిన పోలీసులు వ్యభిచార గృహానికి వచ్చిన ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. కాగా నిర్వాహకులు సంఘటనా స్థలి ఉంచి పరారు కావడంతో పోలీసులు వారి కోసం గాలింపు చేపట్టారు. కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఒయు క్యాంపస్‌లో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**తార్నాక, జనవరి 29 ప్రభాతవార్త :** అందరూ నిద్రిస్తున్న వేళలలో ఇంట్లో ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసుస్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఉస్మానియా యూనివర్సిటీ క్యాంప్ నెంబర్ 6లో నివాసం ఉంటున్న మహమ్మద్ పాషా ఆలీ(28). అతడికి భార్య, కుమారుడు ఉన్నారు. బ్రతుకుదెరువు కోసం దుబాయి వెళ్లడానికి సన్నద్ధం అయ్యాడు. అంతలోనే ఏమైందో ఏమో గతరాత్రి అందరూ నిద్రిస్తుండగా ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం నిద్రలేచేసరికి మహమ్మద్ పాషా ఫ్యాన్‌కు వేలాడుతూ విగత జీవిగా కనిపించడంతో గమనించిన కుటుంబ సభ్యులు రోదిస్తూ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఓయూ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనంచేసుకుని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అతని ఇంట్లో ఎవరితో ఏలాంటి గొడవలు లేవని పోలీసులు అంటున్నారు. అతని ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

# సర్వం సిద్ధం..

- నేడు జిహెచ్ఎంసి "బడ్జెట్ "మీటింగ్
- ఉదయం 10.30గంటలకు సభ ప్రారంభం
- రూ.8,440 కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టనున్న మేయర్
- ఆమోదించనున్న కౌన్సిల్ సభ్యులు
- ప్రజాసమస్యలపై చర్చించేందుకు ప్రతిపక్షాలు సన్నదం



**హైదరాబాద్, జనవరి 29,ప్రభాతవార్త:** నేడు(గురువారం) జీహెచ్ఎంసీ బడ్జెట్ మీటింగ్‌కు అంతా సిద్దమైంది. ఉదయం 10.30 గంటలకు జిహెచ్ఎంసి సర్వసభ్య సమావేశం ప్రారంభం కానుంది. 2025-26 ఆర్థిక సంవత్సారానికి సంబంధించి ఈ సమావేశం జరుగుతుంది. అలాగే వచ్చే ఆర్థిక సంవత్సానికి సంబంధించి రూ.8440 కోట్ల బడ్జెట్‌తోపాటు 2024-25లో ప్రవేశపెట్టిన రూ. 7,937 కోట్ల నుంచి రూ. 8,118 కోట్లకు సవరించిన దానికి ఆమోదం కోసం ప్రవేశపెట్టను న్నారు. ఈ సమావేశంలో బడ్జెట్ పై చర్చతో పాటు పలు అంశాలపై చర్చించేందుకు ఇప్పటికే కార్పొరేటర్ల నుంచి 125 ప్రశ్నలను అధికారులు సేకరించగా అందులో నుంచి 19 ప్రశ్నలను చర్చించేందుకు ఆమోదించారు. అలాగే ఈసమావేశంలో ఇది వరకు చేసిన పనులపై చర్చించేందుకు కార్పొరేటర్లు పట్టు బట్టే అవకాశముంది. కౌన్సిల్ ఏర్పడి నాలుగేళ్లు పూర్తికావస్తున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలు ఎంత మేరకు అమలయ్యాయనే దాంతో పాటు అభివృద్ధిపై చర్చకు డిమాండ్ చేయనున్నట్లు సమాచారం. బడ్జెట్‌కి సంబంధించి ఇప్పటికే స్టాండింగ్ కమిటీ సభ్యులు ఒకసారి తిరస్కరించిన ఆతర్వాత ఆమోదం తెలిపారు. బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ ఆతర్వాత కాంగ్రెస్‌లో చేరారు. దీంతో స్టాండింగ్ కమిటీ సభ్యులు కూడా ప్రస్తుతం బీఆర్ఎస్, ఎంఐఎంకి చెందినవారే ఉండటంతో మేయర్‌కి మద్దతుగా ఎవరు లేకపోవ దంతో బడ్జెట్‌కి వెంటనే ఆమోదం లభించలేదు. ఇదే విధంగా కౌన్సిల్‌లోనూ బడ్జెట్‌కి ఆమోదం లభిస్తుందా? లేదా అన్నదానిపై చర్చజరుగుతుంది. జీహెచ్ఎంసీలో మొత్తం 150 మంది కార్పొరేటర్లు ఉండగా ప్రస్తుతం కాంగ్రెస్ 24, బీజేపీ 39, ఎంఐఎం 41, బీఆర్ఎస్ 42 మంది ఉన్నారు. సమావేశానికి సంబంధించి ఇప్పటికే అన్ని పార్టీల కార్పొరేటర్లు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కౌన్సిల్‌లో అనుసరించాల్సిన వ్యూవహాలపై ఆయా పార్టీ ఆధినాయకులు వారికి దిశానిర్దేశం చేశారు. గతంలో మాదిరిగా కాకుండా సమస్యలు, ఇది వరకు చేసిన పనులపై చర్చించేందుకు కార్పొరేటర్లు పట్టు బట్టే అవకాశముంది. అలాగే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరినందుకు మేయర్‌కు వ్యతిరేకంగా ఆమెకు వ్యతిరేకంగా నిరసన తెలిపేందుకు బీఆర్ఎస్ కార్పొరేటర్లు సిద్దమైనట్లు తెలుస్తుంది. అలాగే అమెపై అవిశ్వాసం పెట్టాలని అనుకునప్పటికీ ఫిబ్రవరి 11 వరకు అవకాశంలేదు. దీంతో ఒవైపు నిరసన తెలుపుతూనే మరోవైపు ప్రజాసమస్యలపై పోరాడేందుకు బిఆర్ఎస్ సన్నదం అవుతుంది. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్, దోమలు, కుక్కలు, శానిటేషన్ అంశాలపై ప్రశ్నలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రశ్నలను ఎంపిక చేయడంలో మేయర్ వివక్ష చూపించారని, తమ సభ్యులకు సంబంధించిన ప్రశ్నలను కావాలనే పక్కనబెట్టారని బీఆర్ఎస్ కార్పొరేటర్లు విమర్శిస్తున్నారు. దీనిపై చర్చకు బీఆర్ఎస్ సభ్యులు పట్టుబట్టే అవకాశముంది.

**భారీ బందో బస్తు ఏర్పాటు..**

జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం నేపథ్యంలో పోలీసులతో భారీ బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ, కార్పొరేటర్లు ఆందోళన చేపట్టే అవకాశముందని సమాచారం రావడంతో బందోబస్తును పెంచినట్టు ఓ సీనియర్ అధికారి తెలిపారు. అలాగే జీహెచ్ఎంసీ పరిణంలో ఆంక్షలు విధించనున్నారు. కౌన్సిల్ సమావేశంలో ఆందోళనకు దిగితే సభ్యులను నియంత్రించడానికి మార్షల్స్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

**బిజెపి, కాంగ్రెస్ కార్పొరేటర్ల రహస్య భేటి...**

జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ ఓఎస్డీ ఛాంబర్‌లో పలువురు బీజేపీ, కాంగ్రెస్ కార్పొరేటర్లు రహస్యంగా బేటి అయ్యారు. గంటకుపైగా ఇరుపార్టీలకు నలుగురు కార్పొరేటర్లు చర్చించుకున్నారు. కౌన్సిల్ సమావేశం సజావుగా జరగడానికి సహకరించాలని బీజేపీ కార్పొరేటర్లను కాంగ్రెస్ కార్పొరేటర్లు కోరినట్టు ప్రచారం జరుగుతున్నది. దీంతో గురువారం జరిగే సభలో బిజెపి, కాంగ్రెస్ ఎలాంటి వ్యూహాలను అవలంభించబోతుందన్నది చర్చణీయాంశంగా మారింది.



ఉపకులపతి జానయ్యతో ఇక్రిశాట్ నూతన డైరెక్టర్ జనరల్ డా. హిమాన్షు పాఠక్

## ఉపకులపతితో ఐసిఎఆర్ డైరెక్టర్ జనరల్ భేటీ

**అత్తాపూర్ జనవరి 29,ప్రభాతవార్త :** భారత వ్యవసాయ పరిశోధనా మండలి(ఐసిఎఆర్) డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ హిమాన్షు పాఠక్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్యను బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. డాక్టర్ హిమాన్షు పాఠక్ ఇటీవలే హైద రాబాదులోని ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్‌గా ఎంపికయ్యారు. మార్చిలో బాధ్యతలు చేపట్ట నున్న సందర్భంగా హైదరాబాద్ పర్యటనలో ఉన్న ఆయన బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టనున్న డా.పాఠక్‌ను, ఉప కులపతి జానయ్య ఈ సందర్భంగా అభినందిం చారు. రాబోయే కాలంలో ఇక్రిశాట్ తో ఉన్న భాగ స్వామ్యాన్ని మరింత పటిష్టపరిచి నూనె గింజలు చిరు ధాన్యాలు పప్పుధాన్యాలు ఉత్పత్తిని పెంచేందుకు అలాగే తెలంగాణ రాష్ట్రంలో ఈ పంటల సాగు పెంపొందించేందుకు తగు సాంకేతిక సహాయాన్ని అందించాలని జానయ్య కోరారు దీనికి డాక్టర్ పాఠక్ సానుకూలంగా స్పందించారు. తన వంతు సహకారాన్ని తెలంగాణ వ్యవసాయ అభివృద్ధికి అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు ఐసిఎఆర్‌లో ఏఆర్ఎస్‌లో బ్యాచ్‌మెట్‌లు కావడం, ఫిలిప్పీన్స్‌లోని అంతర్జా తీయ వరి పరిశోధన స్థానంలో సహ శాస్త్రవేత్తలుగా పనిచేసిన రోజులను, అనుభవాలను ఈ గుర్తు చేసుకున్నారు.

## అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఆహ్వానం



మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

**నార్సింగి, జనవరి 29 ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మూడు మున్సిపాలిటీలలో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి రావాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబును ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ, వచ్చే నెల ఆరో తేదీన బండ్లగూడ జాగిర్ కార్పొరేషన్, మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిల్లో పూర్తి చేసిన అభివృద్ధి పనులతో పాటు కొత్త పనుల శంకుస్థాపనలను ప్రారంభించేందుకు రావాలని మంత్రిని కోరినట్లు వివరించారు. ఇందుకు మంత్రి తప్పకుండా వస్తానని హామీనిచ్చారని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. కోట్లాది రూపాయలతో అభివృద్ది పనులను చేస్తూ అభివృద్ధిలో రాజధాని హైదరాబాద్ నగరానికి దీటుగా శివారు మున్సిపాలిటీలను తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ఇటీవలనే ప్రజాప్రతినిధుల పాలన గడువు ముగిసిందని, ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైందని, ఇప్పుడు మరింత జాగరూకతతో విధులు నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్లతో సమావేశమై ఆదేశించడం జరిగిందన్నారు. ఏ ప్రాంతంలో సమస్యలున్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, లేదంటే నేరుగా నన్ను సంప్రదించాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అధికారులైనా, నాయకులైనా ప్రజల సమస్యలు త్వరగా పరిష్కరించడంపైనే శ్రద్ధ వహించాలని సూచించారు.

### మహాకుంభ మేళాలో పుణ్య స్నానాలు చేసిన నార్సింగి నేతలు

**నార్సింగి, జనవరి 29 ప్రభాతవార్త:** ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంఘంలో జరుగుతున్న మహా కుంభమేళలో మౌని అమావాస్య రోజు నార్సింగి మున్సిపల్‌కు చెందిన పలువురు రాజకీయ నాయకులు పుణ్య స్నానాలు చేశారు. కొల్లూరు ప్రభాకర్, సత్యనారాయణయాదవ్, మహేందర్‌గౌడ్, కిరణ్ కుమార్, సునీల్, రాజు, శివారెడ్డి, తిరుమలేష్‌లు మౌని అమావాస్య రోజు 144.ఏళ్లకు ఒకమారు వచ్చే మహాకుంభ మేళలో పవిత్ర స్నానాలు చేయాలని మూడు రోజుల ముందే ప్రయాగకు బయలుదేరి వెళ్లారు. పవిత్ర దినం రోజు మాకు స్నానాలు చేసే అవకాశం లభించిందని, ఇది నీలకంఠుడి కరుణా,కటాక్షాలతో సాధ్యపడిందని నాయకులు పేర్కొన్నారు. కోట్లాది మంది పుణ్య స్నానాలు చేస్తున్నా త్రివేణి సంఘంలోని నీరు స్వచ్ఛంగా ఉండడం హరహర మహాదేవుడి మహిమనే కారణమన్నారు.

## నృత్య నీరాజనం గోడపత్రిక ఆవిష్కరణ



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న డాక్టర్ కెవి.రమణాచారి, తదితరులు

**చిక్కడపల్లి, జనవరి 29 ప్రభాతవార్త:** ప్రపంచంలో కళలకు మించిన ప్రక్రియ పుట్టలేదని, పని నుండి పాట పరిణామం చెందిందని అని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి. రమణాచారి అన్నారు. ఫిబ్రవరి 16న బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించతలపెట్టిన తెలంగాణ బాలోత్సవం ప్రజాపాటకు నృత్య నీరాజనం గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం జరిగింది. ఆవిష్కరించిన అనంతరం రమణాచారి మాట్లాడుతూ రాజుల కాలంలో జమీందారుల పోషణలో ఆది నుండి కళలన్నీ పోషించి బడ్డాయి కాలానికి అనుగుణంగా మార్పులుచేర్పులు చేసుకుంటూ ముందుకు పోవాలని ప్రజల అభిరుచులకు తగ్గట్లుగా వ్యవహరించాలని అన్నారు. అందుకే తెలంగాణ బాలోత్సవం ప్రజాపాటలకు నృత్య నీరాజనం (సెమీ క్లాసికల్)కార్యక్రమం సాగుతుందని అన్నారు. నాట్యరీతులు లలితకళలు సామాన్యుడికి అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం తెలంగాణ బాలోత్సవం చేస్తుందని అన్నారు. కూచిపూడి నృత్య ప్రపంచంలో అరి తేరిన కళాకారిణి రుక్మిణీ అరుండెల్, వెంపటి చిన్నసత్యం, శోభనాయుడు అనేక ప్రయోగాలు చేశారని, తెలంగాణలో నృత్యగురువులు ఇందిరాపరాశరం, రమణిసిద్ది నేతృత్వంలో కార్యక్రమం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతివెంకటేశ్వర్లు కార్యదర్శి సోమయ్య ఉపాధ్యక్షురాలు సుజావతి గారు నృత్య గురువులు రమణి సిద్ది, ఇందిరా పరాశరం పాల్గొన్నారు.

### భక్తి శ్రద్ధలతో కాళీమాతకు ప్రత్యేక పూజలు

**మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 29 ప్రభాతవార్త :** హైదరాబాద్ బెంగాలీ స్వర్ణ శిల్పి వివేకానంద కాళీమాత మందిరం ఐదవ వార్షి కోత్సవం సందర్భంగా భక్తిశ్రద్దలతో భక్తులు నరకూడ్‌లోని శ్రీకాళీమాత మందిరంలో పూజలు నిర్వహించారు. బుధవారం మందిరంలో జరిగిన ఉత్సవాలలో చిన్నజీయర్ స్వామి పాల్గొని పూజలు జరిపారు.మందిరం కమిటి ప్రతినిధులు చిన్న జీయర్‌స్వామికి మెమోంటోను ప్రదానంచేశారు. గురువారంతో ముగియు నున్న ఈఉత్సవాలలో పాతబస్తీలోని ఘాన్సీబజార్, కోకరివాడి, షక్కర్ కోట, చేలాపుర, ఆనందగల్లీ, మిట్టికాషేర్, చార్‌కమాన్, రికాబ్‌గంజ్ ప్రాంతాలకు చెందిన బెంగాలీలు పాల్గొన్నారు. మూడురోజులపాటు వైభవంగా ఉత్సవాలను జరుపుతున్నామని మందిరం కమిటి ప్రధాన కార్యదర్శి బరుణ్ దాదా తెలిపారు.



ఉత్సవాలలో పాల్గొన్న చిన్న జీయర్ స్వామి

# ఇంగ్లీషు లెక్చరర్ వర్సెస్ ప్రిన్సిపాల్ మధ్య పోస్టింగ్ వివాదం

**ఒకరిపై ఒకరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు**
**విద్యార్థులతో కలిసి లెక్చరర్ ఆందోళన**



కళాశాలలో విద్యార్థులతో కల్సి ఆందోళన చేస్తున్న ఇంగ్లీషు లెక్చరర్

**బేగంపేట, జనవరి 29, ప్రభాతవార్త :** విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన లెక్చరర్, క్రమశిక్షణలో ఉండేలా చూసుకోవాల్సిన ప్రిన్సిపాల్ విద్యార్థుల సమక్షంగా ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదులు చేసుకుని కళాశాలలో లెక్చరర్ ధర్నా చేయడం ఆమెకు మద్దతుగా విద్యార్థినులు ఎన్ఎస్‌యుఐ విద్యార్థులు ఆందోళన చేయడంతో బేగంపేటలోని మహర్షి మహిళా కళాశాలలో వివాదం ఒక్కసారిగా రచ్చ కెక్కింది. కళాశాలలో కూర్చున్న తనను సెల్‌ఫోన్‌తో వీడియో తీశారంటూ ఇంగ్లీషు లెక్చరర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా,తన కార్యాలయం ముందు వెకిలి చేష్టలు చేస్తుండటంతో ఆధారాల కోసం వీడియో తీశానని, దీంతో తన ఫోన్‌ను లాక్కుని పగుల గొట్టారని ఇంచార్జి ప్రిన్సిపాల్ బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేసారు. బేగంపేట పోలీసుస్టేషన్ పరిధిలో బుధవారం జరిగిన ఈ సంఘటనపై ఇన్‌స్పెక్టర్ చిర్ర రామయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కళాశాలకు చెందిన ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, ఇంగ్లీషు లెక్చరర్ల మధ్య ప్రిన్సిపాల్ పోస్ట్ విషయంలో న్యాయ స్థానంలో వివాదం నడుస్తుందన్నారు. ఈ క్రమంలో ఈ నెల 25వ తేదీన మధ్యాహ్నం ఇంగ్లీషు లెక్చరర్ మరికొందరితో కల్సి కార్యాలయంలో కూర్చున్న సమయంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, మరో క్లర్కు వీడియో తీస్తున్నట్లు గుర్తించిన ఇంగ్లీషు లెక్చరర్ లోపలికి వెళ్లి ఫోన్ తీసుకుని పగుల గొట్టారన్నారు. ఇదే విషయమై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కూడా ఫిర్యాదు చేసారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. తన కార్యాలయం ముందు కూర్చుని వెకిలి చేష్టలు చేస్తుండటంతో ఆధారాల కోసమే వీడియో తీసానని, దీంతో తన ఫోన్ లాక్కుని ఫోన్ పగుల గొట్టారని ఇంచార్జి ప్రిన్సిపాల్ తన ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ఇద్దరి ఫిర్యాదులను పరిశీలించి, విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఇదిలా ఉంటే బుధవారం కళాశాల కార్యాలయం ఎదుట కొందరు విద్యార్థినులు ఇంగ్లీషు లెక్చరర్‌తో కల్సి ఆందోళనకు దిగారు. ఇంగ్లీషు మేడంకు తెలియకుండా ఆమె వీడియోను ఎలా తీస్తారని అడిగితే ప్రిన్సిపాల్ కార్యాలయంలో సరైన సమాధానం ఇవ్వలేదని, బాధ్యులైన వారిపై చర్యలు చేపట్టాలంటూ వారు కోరారు.

# అవినీతి పాల్పడుతున్న డిఎస్ఓపై విచారణ జరపాలి

**బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్**



మాట్లాడుతున్న యుగంధర్‌గౌడ్

**సైఫాబాద్, జనవరి 29 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలో ధాన్యం పేరుతో కోట్లాది రూపాయలు దండుకుంటున్న అధికారుల అవినీతి అక్రమాలపై ప్రభుత్వం విచారణ జరిపి సస్పెండ్ చేయాలని తెలంగాణ బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ విజ్ఞప్తి చేశారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాశీవిశ్వనాథ్ వనపర్తి జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి (డిఎస్‌ఓ)గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అనేక అవినీతి అక్రమాలకు పాల్పడుతూ జిల్లాలో సుమారు 40 మిల్లులకు అర్హత ఉన్నప్పటికి తప్పుడు సమాచారంతో ప్రక్కక జిల్లాలకు ధాన్యం కేటాయించి, తన కార్యాలయంలో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగి బంధుల అకౌంట్‌లోకి డబ్బులు పంపుతున్నారని ఆరోపించారు. పక్క జిల్లా మిల్లులకు కేటాయింపులు చేసినందుకు బస్తాకు 5 రూపాయలు దండుకుంటున్నారని, కొన్ని మిల్లుల నుంచి ఏకమొత్తంగా 50 వేల నుంచి లక్ష రూపాయల వరకు లంచాలు తీసుకుంటున్నారని ఆయన తెలిపారు. పాతడిఎం ఇర్ఫాన్, డిప్యూటేషన్ మీద వెళ్ళిన కాశీవిశ్వనాథ్ ఇద్దరూ దోపిడీ చేసి పివి పేరుతో వసూళ్ళకు పాల్పడి వాటాలు వేసుకుంటున్నారన్నారు.

ఈ అధికారులు చేసిన నిర్వాకం వల్ల ఉపాధి కోసం మిల్లులు పెట్టుకున్న 40 మందితో పాటు వాటిలో పనిచేసే కార్మికులు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందన్నారు. కాశీవిశ్వనాథ్ ప్రస్తుతం సివిల్ సప్లైయి కమిషనర్ కార్యాలయంలో డిప్యూ టేషన్‌పై పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. అధి కారుల అవినీతికి సంబంధించిన అన్ని ఆధారాలు తమ దగ్గర ఉన్నాయని ఆరోపించారు. ఈ కార్య క్రమంలో జెఎసి నాయకులు వి.వి.గౌడ్, సంపత్ కుమార్, సాయిబాబా, మహేందర్ నాయుడు జితేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**చార్మినార్, జనవరి 29 ప్రభాతవార్త :**

విద్యుత్ మరమ్మతులు కారణంగా ఈ నెల 30వ తేదీ గురువారం ఉదయం 10 నుంచి 12 గంటలు వరకు జిఎం కాలనీ ఫీడర్,12 నుంచి 2 వంరకు సాయి బాబానగర్ ఫీడర్,3 నుంచి 5 వరకు మేథర్‌వాడి ఫీడర్ పరిధులలో విద్యుత్ సరఫరాను నిలిపివేయ నున్నట్లు ఫలక్‌నుమా సిబిడి అధికారులు తెలిపారు. లాల్‌దర్వాజ, షాలిమార్, జూ క్వార్టర్స్ ఫీడర్ల పరిధులలో 10 నుంచి 12 గంటలు వరకు, చార్మినార్, లాడ్‌బజార్, కిషన్‌బాగ్ ఫీడర్ల పరిధులలో 12 నుంచి 2 గంటలు వరకు, కిల్వత్,ఫత్తెదర్వాజ ఫీడర్ల పరిధులలో 2 నుంచి 5 గంటలు వరకు, అల్లామసీదు ఫీడర్ పరిధిలో 3 నుంచి 5 గంటలు వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నామని చార్మినార్ సిబిడి అధికారులు తెలియజేశారు.

### జాహిద్‌నగర్ కాలనీ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

**ఉప్పల్, జనవరి 29 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ చిలుకానగర్ డివిజన్ జాహిద్‌నగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని పలువురు కాలనీ నేతలు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమలో కాలనీ సంఘం నేతలు ఫారూక్, సునీల్, జునైద్, అరిఫ్, సలీమ్, ఒబైద్, మీనేష్, శ్రీకాంత్‌రెడ్డి, ప్రకాష్‌రావు, నరేందర్, ఇక్బాల్, సీమారెడ్డి, మోప్రాజ్, శరత్ తదితరులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కాలనీ వెల్ఫేర్ సొసైటీ ద్వారా వివిధ కార్యక్రమాలు చేపట్టామని, ప్రజలకు మెరుగైన భద్రత కల్పించేందుకు సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సొసైటీ భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టాలని వారు కోరారు. దీనిపై ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జిహిద్‌నగర్ కాలనీ నేతలు

### మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన టిజిఓ నేతలు

**హైదరాబాద్, జనవరి 29 ప్రభాతవార్త :** రాష్ట్ర బిసి సంక్షేమ, రవాణా మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను టిజిఓ హైదరాబాద్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఎంబి కృష్ణాయాదవ్, కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, వైస్ ప్రెసిడెంట్ ఎస్. ఏంజులారెడ్డి ట్రెజరర్ వెంకటరమణ, కార్యవర్గ సభ్యులు కలిసి సంఘం డైరీ, క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. హైదరాబాద్‌ను మొదటి స్థానంలో నిలిపేలా పనిచేస్తామని సంఘం సభ్యులు మంత్రికి తెలిపారు.

### నీటి సరఫరాలో పాక్షిక అంతరాయం

**హైదరాబాద్, జనవరి 29 ప్రభాతవార్త :** నాసర్ల పల్లి సబ్ స్టేషన్ లోని 132 కెవి బల్క్‌లోడ్ ఫీడర్ పిటి మరమ్మతులకు గురైంది. టిజి ట్రాన్స్‌కో అధికారులు ఫిబ్రవరి 1వ తేది శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రిపేర్లు చేయనున్నారు. దీని వల్ల కృష్ణా ఫేజ్ 1, 2, 3 నుంచి సరఫరా అయ్యే కింద పేర్కొన్న రిజర్వాయర్ల పరిధి ప్రాంతాల్లో 6 గంటల పాటు తాగునీటి సరఫరాలో పాక్షిక అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. కావున అంతరాయం ఏర్పడే ప్రాంతాల ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలన్నారు.

**పాక్షిక అంతరాయం కలిగే ప్రాంతాలు**

ఓ అండ్ ఎం డివిజన్ 1 : మిరాలం, కిషన్ బాగ్, అల్జుబైల్ కాలనీ, శాస్త్రిపురం, ఓ అండ్ ఎం డివిజన్ 2 : సంతోష్ నగర్, వినయ్ నగర్, సైదాబాద్, చంచల్ గూడ్, ఆస్మన్ గఢ్, యాకుత్ పురా, మాదన్నపేట్, మహబూబ్ మాన్షన్, ఓ అండ్ ఎం డివిజన్ 3 : భోజగుట్ట, షేక్ పేట్, ఓ అండ్ ఎం డివిజన్ 4 : బొగ్గులకుంట, అఫ్జల్ గంజ్, ఆళ్లబండ, ఓ అండ్ ఎం డివిజన్ 5 : నారాయణగూడ్, అడిక్ మెట్, శివం రోడ్, చిలకల గూడ, ఓ అండ్ ఎం డివిజన్ 6 : జూబ్లీహిల్స్, ఫిల్మ్ నగర్, ప్రశాసన్ నగర్, తట్టిఖాన, ఓ అండ్ ఎం డివిజన్ 7 : తార్నాక, లాలాపేట్, బౌద్ధనగర్, మారేడ్ పల్లి, కంట్రోల్ రూమ్, రైల్వేస్, ఎంఈఎస్, కంటోన్మెంట్, ప్రకాశ్ నగర్, పాటిగడ్డ, ఓ అండ్ ఎం డివిజన్ 8 : రియాసత్ నగర్, ఆలియాబాద్, మైసారం, బండ్లగూడ, ఓ అండ్ ఎం డివిజన్ 9 : హస్మత్ పేట్, ఫిరోజ్ గూడ, గౌతమ్ నగర్, ఓ అండ్ ఎం డివిజన్10 : సాహేబ్ నగర్, వైశాలినగర్, అల్కాపురి, ఓ అండ్ ఎం డివిజన్ 11 : బిఎన్ రెడ్డి నగర్, వనస్థలిపురం, ఆటోనగర్, ఓ అండ్ ఎం డివిజన్ 13 : మహేంద్రహిల్స్, ఓ అండ్ ఎం డివిజన్ 14 : ఏలుగుట్ట, రామంతాపూర్, ఉప్పల్, నాచారం, హబ్సిగూడ, చిల్కానగర్, దేవేందర్ నగర్, ఓ అండ్ ఎం డివిజన్15 : గచ్చిబౌలి, మాదాపూర్, అయ్యప్ప సొసైటి, కావురి హిల్స్, ఓ అండ్ ఎం డివిజన్ 16 : మధుబన్, దుర్గానగర్, బుద్వేల్, సులేమా నగర్, గోల్డెన్ హైట్స్, 9 నంబర్, ఓ అండ్ ఎం డివిజన్ 18 : హార్డ్ వేర్ పార్క్, ధర్మసాయి, గంధంగూడ, ఓ అండ్ ఎం డివిజన్ 19 : బోడుప్పల్, మల్లికార్జున నగర్, మానిక్ చంద్, చెంగిచెర్ల, భరత్ నగర్, ఆనంద్ నగర్ క్రాస్ రోడ్స్, ఫిర్జాదిగూడ, ఓ అండ్ ఎం డివిజన్ 20 : మీర్‌పేట్, కుర్మగూడ, లెనిన్ నగర్, బడంగ్ పేట్ ప్రాంతాలలో పాక్షికంగా నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని జలమండలి అధికారులు వెల్లడించారు.

# నర్సిరెడ్డి, అశోక్‌కుమార్‌లను ఎమ్మెల్సీలుగా గెలిపించండి

**టిఎస్‌యుటిఎఫ్, టిపిటిఎఫ్ నేతలు**



ఎమ్మెల్సీ అభ్యర్థులను పరిచయం చేస్తున్న టీఎస్‌యూటీఎఫ్, టిపిటిఎఫ్ నాయకులు

**ముషీరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:**

ఫిబ్రవరి 27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎమ్మెల్సీలుగా పోటీ చేస్తున్న అలుగుబెల్లి నర్సిరెడ్డి, వై.అశోక్‌కుమార్‌లను గెలిపించాలని టీఎస్‌యూటీఎఫ్, టిపిటిఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం దోమలగూడలోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు చావ రవి, ఏ.వెంకట్, టీపీటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్.అనిల్‌కుమార్, ఎన్.తిరుపతి మాట్లాడుతూ వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం నుండి ప్రస్తుత ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ ఉపాధ్యాయ నియోజక వర్గం నుండి టీపీటీఎఫ్ పూర్వ అధ్యక్షులు వై.అశోక్‌కుమార్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా బరిలో దిగుతున్నారని తెలిపారు. ఇరువురు ఎమ్మెల్సీ అభ్యర్థులు కూడా గత మూడు దశాబ్దాలుగా ఉపాధ్యాయ ఉద్యమంలో పనిచేసి, నిబద్ధతతో వ్యవహరించారని గుర్తు చేశారు. ఉపాధ్యాయ సమస్యలపట్ల సంపూర్ణమైన అవగాహన కలిగి, ఉద్యమాలకు నాయకత్వం వహించారని, పాలకుల ఉపాధ్యాయ వ్యతిరేక వైఖరిని ధైర్యంగా ప్రశ్నించారని కొనియాడారు. 2019 మార్చిలో నల్లగొడ నియోజకవర్గం నుండి ఎన్నికైన నర్సిరెడ్డి గత ఆరు సంవత్సరాలుగా ఆదర్శవంతమైన పనితీరు కనబరిచారని, తనకు మంజూరైన నియోజక వర్గ అభివృద్ధి నిధులను పూర్తిగా పాఠశాలల, కళాశాలల అభివృద్ధికి కేటాయించారని పేర్కొన్నారు. వై.అశోక్‌కుమార్ టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షునిగా, యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యునిగా అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని, తెలంగాణ ఉద్యమంలో కూడా టీజేఏసీ నాయకునిగా ప్రొఫెసర్ కోదండరాంతో కలసి పని చేశారని గుర్తు చేశారు. ఉపాధ్యాయ, అధ్యాపకుల సంఘాలు, అనుబంధాలతో నిమిత్తం లేకుండా, ఏ విధమైన ప్రలోభాలకు గురికాకుండా, విలువలకు కట్టుబడి పనిచేస్తున్న ఇరువురు ఉద్యమ నాయకులను గెలిపించి, శాసనమండలిలో మామన్‌టీచర్ వాయిస్‌ను వినిపించే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థులు అలుగుబెల్లి నర్సిరెడ్డి, వై.అశోక్‌కుమార్, నాయకులు కే.జంగయ్య, జి.తిరుపతిరెడ్డి, ఎం.రవీందర్, ఎం.లక్ష్మయ్య, డి.రాజయ్య, ఎస్.విజయ్, ఎం.ప్రకాశ్ రావు తదితరులు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రులు శ్రీధర్‌బాబు, ప్రభాకర్ తదితరులు

## హెచ్‌యుజె డైరీని ఆవిష్కరించిన మంత్రులు

**హైదరాబాద్, జనవరి 29 ప్రభాతవార్త:** హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యుజె) రూపొందించిన నూతన సంవత్సరం డైరీని రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్ బుధవారం నాడిక్కడ ఆవిష్కరించారు. ఈ కార్య క్రమంలో రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, కార్పొరేషన్ ఛైర్మన్ ఫహీమ్ ఖురేషి, మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, టియూడబ్ల్యూజె అధ్యక్షుడు విరాహత్‌అలీ, ఉప ప్రధాన కార్యదర్శి కె.రాములు, హెచ్‌యుజె అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివశంకర్‌గౌడ్, అబ్దుల్‌హమీద్ తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ దేవాలయంలో అన్నదానం

**నార్సింగి, జనవరి 29 ప్రభాతవార్త :** అమ్మవారి దేవాలయం వద్ద అన్నదానం చేసే అవకాశం లభించడం పూర్వజన్మ సుకృతమని మణికొండ ఆర్యవైశ్య సంఘం నాయకుడు సముద్రాల రమేష్ పేర్కొన్నారు. బుధవారం మణికొండ క్వార్టర్స్ వద్ద ఉన్న పోచమ్మ దేవాలయం ఆవరణలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభకు అనుబంధంగా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రతీ నెల అమావాస్య రోజు పోచమ్మ అమ్మవారికి నైవేద్యం పెట్టిన తరువాత భక్తులకు అన్నదానం చేస్తున్నామన్నారు. కొలిచిన వారికి కొంగు బంగారంగా నిలుస్తున్న పోచమ్మ అమ్మవారికి ప్రతీనెలా భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రాఘవరెడ్డి, దొడ్డి లక్ష్మణ్, శ్రీనివాస్, శ్రీధర్, స్రవంతి, మోహనకృష్ణ, అందె లక్ష్మణ్‌రావ్, సందీప్, బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఛత్తీస్‌ఘడ్‌లో ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

**కమ్యూనిస్టు నేతలు డిమాండ్**

**సైఫాబాద్, జనవరి 29 ప్రభాతవార్త:** దేశంలోని సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడానికి ఛత్తీస్‌ఘడ్‌లో కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలుపుదల చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఇప్పటివరకు జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు జడ్జిచే విచారణ జరిపించాలని కోరారు. సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'నక్సల్ పట్ల కేంద్ర ప్రభుత్వ రాక్షస విధానాన్ని ఖండిద్దాం-ప్రశ్నించే గొంతుకులన కాపాడుకుందాం' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ప్రొఫెసర్ జి.హరగోపాల్, మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ పాత్రికేయులు కె.శ్రీనివాస్, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, సిపిఐ నాయకులు వి.ఎస్.బోస్, సిపిఎం నాయకుడు డిజి నర్సింహారావు, ఎస్‌యుసిఐ కార్యదర్శి సి.హెచ్.మురహరి, ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, సిపిఐ (ఎంఎల్) నాయకుడు చలపతిరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. తరతరాలుగా అడమీ నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీలపై క్రూరంగా దాడులు చేస్తూ హత్యచేస్తున్నదని వారు ఆరోపించారు. ప్రశ్నించే గొంతులను అణిచివేసి ప్రజాస్వామ్యానికి మచ్చలాగా వ్యవహరిస్తున్నదన్నారు. కమ్యూనిస్టులను అంతం చేయాలనే ఆశయంతోని బిజెపి ప్రభుత్వం పనిచేస్తున్నదని ఇద్కేడి న్యాయమని వారు ప్రశ్నించారు. తక్షణమే కగార్‌ను నిలుపుదల చేసి, శాంతియుత వాతావరణాని న్న నెలకోల్పాలని వారు డిమాండ్ చేశారు.

### రైల్వే లోకో రన్నింగ్ స్టాఫ్ పని భారానికి, ప్రైవేటీకరణ చర్యలకు వ్యతిరేకంగా ఉద్యమం

**చిక్కడపల్లి, జనవరి 29ప్రభాతవార్త:** దక్షిణ మధ్య రైల్వే ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసిసోయేషన్ (ఏఐఎల్ఆర్ఎస్ఏ) జోనల్ మహాసభ బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి జె. వెంకటేష్లు పాల్గొన్నారు. పాలడుగు భాస్కర్ ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ఏ ఉద్యోగులకు కిలోమీటర్ అలవెన్స్ తప్పనిసరిగా పెంచాలని, ప్రయాణీకుల భద్రత రీత్యా నైట్ డ్యూటీలను నియంత్రించాలని, ఖాళీలను భర్తీ చేయాలని, ఏడవ పే కమిషన్ అనామలిస్‌ను సరిదిద్దాలనీ, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలన్న డిమాండ్లపై ఎల్ఆర్ఎస్ఏ సిబ్బంది ఉద్యమించాలని కోరారు. 3వ సారి అధికారంలోకి వచ్చిన కేంద్ర బిజెపి ప్రభుత్వం రైల్వే రంగాన్ని సంస్కరణల పేరుతో బలహీన పరుస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టీకరణను విచ్చిలవిడిగా పెంచుతూ అంబానీ, ఆదానీల వంటి గుత్త సంస్థలకు రైల్వే రంగాన్ని కారుచౌకగా కట్టబెడుతున్నదని ఘటుగా విమర్శించారు. ప్రజారవాణాలో దేశంలో ముఖ్య భూమిక పోషిస్తున్న ప్రతిష్టాత్మకమైన రైల్వే రంగాన్ని కార్పొరేటీకరించడం అన్యాయమని అన్నారు. జె.వెంకటేష్ మాట్లాడుతూ రైల్వేరంగంలో మోడీ సర్కార్ అమలు పరుస్తున్న నష్టదాయక మైన విధానాలకు వ్యతిరేకంగా 2025 ఫిబ్రవరి నెలలో సిఐటియు తెలంగాణ రాష్ట్ర కమిటీ చేపట్టనున్న రాష్ట్ర వ్యాప్త క్యాంపెయిన్లో రైల్వే రంగంలోని అన్ని విభాగాల సిబ్బంది భాగసామ్యం కావాలని కోరారు.

### 'ఉస్మానియా'లో ఐదుగురికి కాలేయ చికిత్స

**బేగంబజార్, జనవరి 29 ప్రభాతవార్త:** ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు మరోసారి కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ఒక నెలల్లో ఐదుగురికి కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలను చేసి మాకు ఎవరు సాటి లేరని నిరూపించారు. ఉస్మానియా వైద్యులను ఎంత గొప్పగా పొగిడినా తక్కువే. ఐదు మందికి ఒక నెలలోపు చేసిన కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలు చేసిన దానికి ప్రైవేట్ ఆసుపత్రుల్లో సుమారు 40లక్షల నుంచి 50 లక్షల రూపాయలవుతుంది. కాని ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు ఉచితంగా చేశారు. ఈ చికిత్సలను ఉస్మానియా ఆసుపత్రి సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్యుల బృందం విజయవంతంగా నిర్వహించడంలో ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్‌వైద్యుల బృందంతో పాటు కోలుకున్న రోగులకు పుష్పగుచ్ఛాలను అందచేసి అభినందించారు. వంశ పారంపర్యంగా సంక్రమించే ఈ అరుదైన కాలేయ మార్పిడి చిన్నారికి సైతం విజయవంతంగా నిర్వహించడం విశేషం. ఖమ్మం జిల్లాకు చెందిన మాస్టార్ అజిత్‌కుమార్(2), మాస్టార్ స్వాతిక్‌గౌడ్(7), వి.వెంకటేష్(20), ఎం.హర్షప్రియా, ఎం. వెంకటేష్‌లకు కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలను చేశారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంటాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్.మధుసూదన్, ప్రొఫెసర్ అభిమన్యు,ఉమాదేవి, రమేష్‌కుమార్, విజయ్‌కుమార్, మాధవి,రఘు, నదీమ్, విజయపవన్, ఎస్.చంద్రశేఖర్, డాక్టర్ లక్ష్మినారాయణ, సునీల్, భవాన, కావ్య, వాసిఫ్‌అలీ, సుదర్శన్‌రెడ్డి, ఆసుపత్రి నర్సింగ్ స్టాఫ్, సిబ్బంది ఉన్నారు.

### అన్నం పరబ్రహ్మ స్వరూపం : జంపన ప్రతాప్

**కంటోన్మెంట్, జనవరి 29 ప్రభాతవార్త:** అన్నం పరబ్రహ్మ స్వరూపమని, ఆకలి మంటలతో అలమటిస్తున్న పేదలకు అన్నదానం చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ జంపనప్రతాప్ తెలిపారు. అమావాస్యను పురస్కరించుకొని బుధవారం కంటోన్మెంట్ 1వ వార్డు బోయిన్‌పల్లి బాపూజీ నగర్, నల్లపోచమ్మ దేవాలయం, చిన్నతోకట్ట కటట మైసమ్మ దేవాలయాల్లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

### వీరరాజారెడ్డి పార్కులో హైమాస్ట్ వీధిదీపాలు

**కార్పొరేటర్ చేతన**

**ఉప్పల్, జనవరి 29 ప్రభాతవార్త :**

హబ్సిగూడ వీరరాజిరెడ్డి పార్కులో కొత్తగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ వీధిదీపాలను బుధవారం సాయంత్రం స్థానిక కార్పొరేటర్ కక్కిరేణి చేతన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వీరరాజారెడ్డి పార్కులో ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు అధికారులతో చర్చించి వీధిదీపాలు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని ఆమె పేర్కొన్నారు. పార్కులో వీధిదీపాల ఏర్పాటుతో కొత్త అందాలు వచ్చాయని, అన్ని ప్రధాన కూడళ్లలో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్కు కమిటీ సభ్యులు రుద్ర శేఖర్, అన్నం రాఘవరెడ్డి, రంగారెడ్డి, ప్రభాకర్‌రావు, జైపాల్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, బిజెపి నేతలు ఎన్.సుమన్‌రావు, చెల్లోజు ఎల్లాచారి, ప్రవీణ్, భాస్కర్, గీత, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న ధనరాజ్ యాదవ్, రంగరాయ ప్రసాద్

## పేదల ఇళ్లు కూల్చడమేనా ప్రజాపాలన ?

**నిజాంపేట్, జనవరి 29, ప్రభాతవార్త :** పేదల ఇళ్లు కూల్చాటమేనా ప్రజాపాలన అంటూ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్‌యాదవ్, ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధ వారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని రాజీవ్ గృహకల్పలో 20 సంవత్సరాల నుండి నివసిస్తున్న పేదల ఇళ్లకు ఇరిగేషన్ అధికారులు ఎటు వంటి సమాచారం ఇవ్వకుండా మార్కింగ్ ఇవ్వడం వల్ల ప్రజలు భయ భ్రాంతులకు గురవుతున్నారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న వెంటనే నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్‌యాదవ్, ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ అక్కడికి వెళ్లి స్థానిక ప్రజలతో కలిసి మార్కింగ్‌లను పర్యవేక్షించి ఎమ్మెల్యే కేపీ వివేకానందకి సమాచారాన్ని తెలియపరిచారు. అలాగే అక్కడ నివ సిస్తున్న ప్రజలకు మీకు అండగా మేమున్నాం మీకు ఎటువంటి నష్టం కలగ కుండా చూసే బాధ్యత మాపై ఉంది. మీరు ఎటువంటి భయభ్రాంతులకు గురి కావొద్దు మీకు ఎల్లవేళలా మేము అందుబాటులో ఉంటాం అని వారికి భరోసా ఇచ్చారు.

## ఉత్తమ ఉద్యోగిగా తహసీల్దార్




కలెక్టర్ నుంచి అవార్డు ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న తహసీల్దార్

**అఫ్జల్‌గంజ్, జనవరి 29 ప్రభాతవార్త:** హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అను దీప్ దురిశెట్టి చేతులమీదుగా నాంపల్లి మండల తహశీల్దార్ ప్రేమ్‌కుమార్ ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో సందర్భంగా ఉత్తమ ఉద్యోగిగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చేతులమీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకోవడం సంతోషదాయకమన్నారు. ముున్ముందు మరింత భాధ్యత పెంచిందన్నారు. పని నిమిత్తం కార్యాలయానికి వచ్చే వారికి సకాలంలో సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు.

## లబ్దిదారులకు చెక్కుల పంపిణీ



లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న తలసాని శ్రీనివాస్‌యాదవ్

**కంటోన్మెంట్, జనవరి 29 ప్రభాతవార్త :** పేదింటి ఆడపడుచు పెండ్లికి మొదటగా ఆర్థిక సహాయం అందించిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదేనని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో అమీర్‌పేట, బేగంపేట డివిజన్‌లకు చెందిన 30 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ, 21, షాదీ ముబారక్ క్రింద 9 మందికి ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆడబిడ్డ పెండ్లి చేయాలంటే ఆర్థికంగా ఎంతో భారంగా మారిందని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని చేయూతను ఇవ్వాలనే ఆలోచనతో దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకలక్ష 116 రూపాయల ఆర్థిక సహాయం అందించే కార్యక్రమానికి నాటి మాజీ ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. అర్హులైనవారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బేగంపేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, అమీర్‌పేట డివిజన్ ప్రధాన కార్యదర్శి నామన సంతోష్‌కుమార్, నాయకులు శ్రీహరి, ప్రవీణ్ రెడ్డి, కర్నాకర్‌రెడ్డి, శేఖర్, కూతురు నర్సింహ, గోపిలాల్ చౌహాన్, బలరాం, ఆరీఫ్, అఖిల్, హరిసింగ్, సుమిత్ సింగ్ పాల్గొన్నారు.

## రహదారి భద్రతపై ఆటో డ్రైవర్‌లకు అవగాహన




ఆటోడ్రైవర్‌లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

**సంజీవరెడ్డినగర్, జనవరి 29 ప్రభాతవార్త :** జాతీయ రహదారి భద్రత మాసోత్సవంలో భాగంగా బుధవారం ట్రాఫిక్ విభాగం వెస్ట్‌జోన్ పరిధిలోని కోట్ల విజయభాస్కరరెడ్డి స్టేడియంలో 300 మంది ఆటో డ్రైవర్లకు అవ గాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీపీ రాహుల్‌హెగ్డే ఐపీఎస్ ముఖ్య అదితిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆటో డ్రైవర్లకు పలు ఉల్లంఘనలు, యూనిఫాం వేసుకోకపోవడం, స్టాప్ లైన్ దాటడం, సిగ్నల్ జంప్, లైసెన్సు లేకపోవడం, సరైన రిజిస్ట్రేషన్ పత్రాలు లేకపోవడం, సరైన ప్రదేశంలో పార్క్ చేయక పోవడం, వేరే వ్యక్తులకు ఇవ్వడం, ఇన్సూరెన్స్ లేకపోవడంలాంటి వాటివల్ల జరిగే నష్టాలను, ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. అలాగే ఆటో డ్రైవర్ల సమస్యలను (జిల్లాల నుండి వచ్చే ఆటోలు, టాక్సీ రిజిస్ట్రేషన్ కానీ ద్విచక్ర వాహనాలు (ఓలా, ఉబర్) వల్ల వారికి (ఆటో డ్రైవర్లకు) జరిగే నష్టాలను కూడా విని సంబంధిత శాఖల వారితో సమన్వయం చేస్తామని డీసీపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్, ఎస్సార్ నగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సైదులు, జూబ్లీ హిల్స్, బంజారా హిల్స్, పంజా గుట్ట, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్స్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## అమావాస్య అల్పాహారం వితరణ

**నిజాంపేట్, జనవరి 29, ప్రభాతవార్త :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి మమత హాస్పిటల్ ప్రాంగణంలో ఆర్య వైశ్య తూములూరి అనిల్‌కుమార్‌గుప్తా, సంఘం సభ్యులు ఆధ్వర్యంలో అమా వాస్య అల్పాహారం వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్ఎంసీ 16వ డివిజన్ కార్పొరేటర్ ఆగం పాండుముదిరాజ్ విచ్చేసి వాసవీ మాత పూజా కార్యక్రమం పూర్తి చేసే ఆల్పాహారం వితరణ ప్రారంభమైంది. సుమారుగా 200 మందికి పంపిణీ చేశారు. కమిటి సభ్యులు తూములూరి అనిల్‌కుమార్ గుప్తా, గొండెలా శ్రీనివాస్, యమసాని ఆంజనేయులు, నేతి నారాయణ, తడకమళ్ల ఆంజనేయులు, జైన రామ చంద్ర, ఈగ రాజేశ్వరరావు, మహదేవ్, విశ్వనాధం పాలుగోని ఆల్పాహారం 200 మందికి పంపిణీ చేయబడింది. వాసవి మాత దయ వల్ల 3వ నెల విజయవంతంగా పూర్తయింది. ప్రతి సభ్యుడు ప్రతి నెల అమావాస్యకి ఈ విధంగా అమావాస్య దానం చేస్తామని చెప్పారు.

# నిష్ణాతుల అనుభవాల పుష్పగుచ్ఛం 'పరిణతవాణి'

## తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ




పరిణవాణి 11వ సంపుటిని ఆవిష్కరిస్తున్న మామిడిహరికృష్ణ, ఎల్లూరిశివారెడ్డి, చెన్నయ్య తదితరులు

**నాంపల్లి, జనవరి 29 ప్రభాతవార్త :** ఒక వ్యక్తి కవిగా, రచయితగా, పరిణత స్థానానికి చేరడానికి పడిన శ్రమ, ఎదుర్కొన్న కష్టనష్టాలు, సాధించిన విజయాలు, తద్వారా అందించే సందేశం వంద పుస్తకాలు చదివినా లభించదని, అలాంటిది తెలుగు భాషా సాహితీలో నిష్ణాతులైన పెద్దలు తమ అను భవాలను అందించిన తెలుగుభాషా సాహితీ ప్రసంగాల పుష్పగుచ్ఛం పరిణతవాణి అని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ అన్నారు. సారస్వత పరిషత్తు పరిణతవాణి శీర్షికన వినూత్న కార్యక్రమాన్ని 1993వ సంవత్సరం నుండి నిర్విరామంగా కొన సాగిస్తూ ప్రముఖుల ప్రసంగ వ్యాసాలను ఒకచోట కూర్చి ఇప్పటికి 11 సంపుటాలు వెలువరించేందుకు చేస్తున్న విశేషకృషి ప్రశంసనీయమన్నారు. బొగ్గుల కుంట తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో పరి షత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి సభాధ్య క్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డా. మామిడి హరికృష్ణ గౌరవ అతిథులు డా. పురుషోత్తమాచార్య, శీలా సుభద్రాదేవి, జూపాక సుభద్ర, స్వాతి శ్రీపాద, వై.ముకుంద రామారావు, డా. జి.చెన్నకేశవరెడ్డి, పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జె.చెన్నయ్య, ప్రాచ్య కళాశాల ప్రధానాచా ర్యులు డా. సిల్మానాయక్ తదితరులతో కలిసి పరిషత్తు ప్రచురించిన పరిణతవాణి ప్రసంగాల 11వ సంపుటిని ఆవిష్కరించారు. డా. చెన్నయ్య స్వాగ తోపన్యాసం చేయగా శివారెడ్డి అధ్యక్షోపన్యాసంలో ఎప్పుడూ కొత్తదనంతో ఫరిడవిల్లుతున్న సారస్వత పరిషత్తునాటి అధ్యక్షుడు జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా. సి.నారాయణరెడ్డి ప్రారంభించిన తెలుగుభాషా సాహితీ ప్రముఖుల స్ఫూర్తిదాయ ప్రసంగాల పరిణ వాణి నిరంతరాయంగా కొనసాగిస్తూ ఆయాప్రసంగా లను పుస్తకరూపంలో పాఠకులకు అందిస్తున్నామని తెలిపారు. అనంతరం అతిథులు ప్రసంగించారు.



శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో రుద్రహోమం

## ఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో రుద్రహోమం

**బేగంపేట జనవరి 29, ప్రభాతవార్త :** సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి దేవస్థానంలో బుధవారం మౌని అమావాస్య సందర్భంగా రుద్రహోమం నిర్వహించారు. ఈ హోమంలో ఆలయ ఈ ఓ గుత్తా మనోహర్ రెడ్డి, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ సురిటి కామేశ్వర్, మాజీ ధర్మకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ప్రతి కుటుంబానికి అమ్మ వారి ఆశీస్సులు అందజేయాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాద వితరణ చేసారు.

## హమాలీల సమస్యలు పరిష్కరిస్తా : ఎమ్మెల్యే శ్రీగణేష్



ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు వినతిపత్రం హమాలీల సంఘం ప్రతినిధులు

**కంటోన్మెంట్, జనవరి 29 ప్రభాతవార్త:** బోయిన్‌పల్లి కూరగాలయ మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ అన్నారు. బోయిన్‌పల్లి అంబే ద్కర్ మార్కెట్ యార్డులో పనిచేస్తున్న హమాలీల సమస్యలు పరిష్కరిం చాలని కోరుతూ సంఘం అధ్యక్షులు ఉగ్రం రాములు ఆధ్వర్యంలో బుధ వారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే, మార్కెట్ చైర్మన్ ఆనంద్‌బాబులకు వినతిపత్రం అందజేశారు. మార్కెట్ యార్డు ప్రాంగణంలో మూత్రశాలలు, టాయిలెట్స్ వంటి మౌళిక సదుపాయాలు మెరుగుపర్చాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. బోయిన్‌పల్లి మార్కెట్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు విడుదల చేయడంతో పాటు హమాలీలకు, అందులో పనిచేస్తున్న ఉద్యోగులకు, కార్మికులకు మౌళిక సదుపాయాలు మెరుగుపర్చేందుకు ప్రత్యేక నిధులు కెటాయిస్తామన్నారు.

## కృష్ణమాదిగపై అనుచిత వాఖ్యలు చేస్తే సహించేది లేదు

**కంటోన్మెంట్, జనవరి 29 ప్రభాతవార్త:** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మంద క్రిష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ కోసం 30 సంవత్సరాల నుంచి అలుపెరుగని పోరాటం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులపై పిడమర్తి రవి అనుచిత వాఖ్యలు చేస్తే తగిన గుణపాఠం చెబుతామని కంటోన్మెంట్ 8వ వార్డు బొల్లారంకు చెందిన ఎమ్మార్పీఎస్ నేతలు దుబ్బ మురళీ మాదిగ, ఈఆర్ బాల్ రాజు మాదిగలు హెచ్చరించారు. బుధవారం బొల్లారంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ వచ్చే ఎస్సీ వర్గీకరణ కోసం మంద క్రిష్ణ మాదిగ వచ్చే నెల 7వ తేదీన తలపెట్టనున్న వెయ్యి గొంతులు, లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలిసింది పోయి నీరు కార్చే విధంగా అనుచిత వాఖ్యలు చేసిన పిడమర్తి రవి, ఆయన అనుచరులు వాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు రమేశ్ మాదిగ, దశరత్ మాదిగ, నరిసింగం మాదిగ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమార్పీఎస్‌నేతలు మురళీమాదిగ, బాల్‌రాజ్ తదితరులు



ఏపీ సీఎంకు ధన్యవాదములు తెలుపుతున్న దండి రాకేష్ తదితరులు

## అధికారికంగా వాసవిమాత ఆత్మార్పణ దినోత్సవం

**హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:** వైశ్యుల ఆత్మాభిమానానికి ప్రతీకగా నిలిచే శ్రీ వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవంను ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించటం హర్షనీయమని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దండి రాకేష్ కొనియాడారు. బుధవారం రండి రాకేష్, వీబీజీ ఫౌం డర్ మడిపడిగె రాజు ఆధ్వర్యంలో ప్రతినిధులు సీఎం చంద్రబాబునాయుడిని కలసి కృతజ్ఞతలు తెలయచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 31న పశ్చిమ గోదావరి జిల్లాలోని పెనుగొడలో శ్రీవాసవి మాత మందిరంలో జరిగే ప్రత్యేక పూజల సందర్భంగా ప్రభుత్వం పట్టు వస్త్రాలు సమర్పించటం అభినందనీయమని అన్నారు. వాసవి మాత ఆత్మార్పణ దినం సందర్భంగా అందరి జీవితాలలో వెలుగులు ప్రసాదిస్తుందని, ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం వైశ్యుల్లో ఐక్యతను కలిగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో నగరంలోని తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో అత్యంత వైభవంగా నిర్వ హించబోయే వి45 కార్యక్రమానికి చంద్రబాబునాయుడిని ఆహ్వానించటం జరిగిందని, దానికి వారు సానుకూలంగా స్పందించారని, వైశ్యులకు మద్దతుగా నిలుస్తున్న చంద్రబాబు నాయుడికి ధన్యవాదములు తెలిచేస్తున్నామన్నారు.

## మోండా డివిజన్ అభివృద్ధికి కృషి : కొంతం దీపిక

కంటోన్మెంట్, జనవరి 29 ప్రభాతవార్త: మోండా డివిజన్‌లోని సికింద్రాబాద్



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ కొంతం దీపిక తదితరులు

రైల్వే స్టేషన్ 31 బస్టాప్ పరిసర ప్రాంతాల్లో మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక, బేగంపేట్ జిహెచ్ఎంసి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్యలతో కలిసి పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కార్పొరేటర్ కొంతం దీపిక సంబంధిత అధికారులకు సూచించారు.

## రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి : ఏసిపి

**కంటోన్మెంట్, జనవరి 29 ప్రభాతవార్త:** ప్రమాదాల నివారణకు డ్రైవర్లు రోడ్డు భద్రతా నసూత్రాలను తప్పని సరిగా పాటించాలని ఉత్తర మండలం ట్రాఫిక్ ఏసిపి జి.శంకర్‌రాజు తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని బుధవారం బోయిన్‌పల్లిలోని ఎయిర్‌పోర్స్ సిబ్బందికి ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వాహనాలు నడిపే వారికి తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్ కలిగి ఉండాలని, ట్రాఫిక్ నసిగ్నల్స్‌వద్ద సగ్నల్స్‌ను తప్పని సరిగా పాటించా లన్నారు. మద్యం నసేవించి డ్రైవింగ్ చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిర్‌పోర్స్‌కమాండర్ రుసుఖేష్, సిఈఓ ప్రేమ్ కుమార్, బోయిన్‌పల్లి ట్రాఫిక్ సిఐ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి కుష్టువ్యాధి నివారణ పక్షోత్సవం

**ముషీరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:** జనవరి 30వ తేదీ ప్రపంచ కుష్టు వ్యాధి దినోత్సవం సందర్భంగా నేటి నుండి ఫిబ్రవరి 13 వరకు కుష్టు వ్యాధి నివారణ పక్షోత్సవంగా నిర్వహిస్తున్నామని ముషీరాబాద్, భోలక్‌పూర్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. బుధవారం ముషీరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ కుష్టువ్యాధిన నివారణ పక్షోత్సవ కార్యక్రమంలో భాగంగా స్పర్శ్ లెప్రసి అవేర్‌నెస్ క్యాంపెయిన్ ద్వారా సమావేశాలు నిర్వహించి, ప్రజల్లో అవగాహన కల్పిస్తామని తెలిపారు. మన సమాజాన్ని లెప్రసి రహిత సమాజంగా మార్చాలనే లక్ష్యంగా జనవరి 30 మహాత్మాగాంధీ వర్ధంతి రోజున ప్రతిజ్ఞ చేయించి, ప్రజల్లో అవగాహన కల్పిస్తామని అన్నారు. కుష్టువ్యాధి అంటే ఏమిటి, ఇది ఎందువల్ల వస్తుంది, ఎలా వ్యాప్తి చెందుతుంది, ఈ వ్యాధి బారిన పడిన వారు ఎటువంటి జాగ్రత్తలు పాటించాలి అనే విషయాలపై ఈ పక్షోత్సవాలలో ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.

# దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

**కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 29, ప్రభాతవార్త**

124 ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువు పరిసర ప్రాంతాల ప్రజలు దోమల బెడద సమస్య ఎక్కువగాఉందని స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకురాగా కార్పొరేటర్ బుధవారం ఎంటమాలజీ సిబ్బందితో కలిసి దోమల నివారణ కొరకు ఎల్లమ్మ చెరువులో తిమేపాస్ కెమి కల్(దోమల మందు)ను డ్రోన్ యంత్రం సహాయం తో పిచ్చకారి చేయడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దోమల నివారణకు తిమే పాస్ కెమికల్ పిచ్చకారి చేయడం వలన చెరువులో ఉన్న దోమ గుడ్లు పిల్లలను లార్వ దశలోనే అరికట్టవచ్చు అన్నారు. ఎల్లమ్మచెరువు పరిసర ప్రాంతాలలో దోమల సమస్య ఎక్కువగా ఉందని గతంలోనే సంబంధిత అధికారులకు శేరిలింగంపల్లి శాసన సభ్యులు పిఏసిచైర్మన్ అరేకపూడి గాంధీ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, వారు సానుకూలంగా స్పందించారని అన్నారు. చలికాలంలో దోమల బెడద ఎక్కువగా ఉన్నమాట వాస్తవమే, ప్రజలు ఇబ్బంది పడు తున్న మాట వాస్తవమే అందుకని నిరంతరం ప్రజల కోసమే పనిచేస్తున్న అధి కారులను సిబ్బందిని నిందించడం సరికాదన్నారు.



చెరువును పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

అధికారులు ప్రజాప్రతినిధులు అందరూ ప్రజల కోసమే పనిచేస్తారని గుర్తుచేశారు. ప్రజల ఇబ్బంది నాకు తెలుసని, నేను ఇక్కడే జీవిస్తూ బాధితు లలో ఒకడిగా ఉన్నాను, దోమల సమస్య ఎంత తీవ్రంగా ఉందో స్వయానుభవం ఉందని తెలి పారు. త్వరలో ఎల్లమ్మచెరువులోని గుర్రపు డెక్కను శుభ్రం చేసి సమస్యను పరిష్కరిస్తామని తెలియ చేసారు. కార్యక్రమంలో గుడ్ల శ్రీనివాస్, ఎంట మాలజి సూపర్వైజర్ డి.నరసింహులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలను అరిట్టాలి

## సిపిఐ మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్

**నిజాంపేట్, జనవరి 29, ప్రభాతవార్త :** అక్రమ నిర్మాణాలను అరిట్టాలని సీపీఐ మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. బుధవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అక్రమ నిర్మాణాలను అరికట్టాలని సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాంపేట్లోని బేరాక్ చర్చ్ ఎదురుగ వున్నా అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని, సంతోష్ నాయక్ అనే వ్యక్తి మున్సిపల్ చట్టలకు వ్యతిరేకంగా జీ+2 పర్మిషన్ తీసుకొని జీ+6 అదునపు అంతస్థులు నిర్మిస్తున్న మున్సిపల్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. అలాగే ప్రక్కనే వున్నా సర్వే నెంబర్ 87 ప్రభుత్వ స్థలంలో కొంత ఆక్రమించి ఈ భవనం నిర్మిస్తున్నారని స్థానికంగా వున్నా ప్రజలు ఆరోపిస్తున్నారని వారు గుర్తు చేశారు. ఇంత జరుగుతున్న రెవెన్యూ అధికారులు ఇటు వైపు చూడకపోవడం అనేక అనుమానాలు వస్తున్నాయని అన్నారు. వెంటనే అటి స్థలాన్ని పరిశీలించి తగు చర్యలు తుసుకోవాలని వారు డిమాండ్ చేస్తారు.

## ఘనంగా ప్రపంచ వాహన దినోత్సవం

**నిజాంపేట్, జనవరి 29, ప్రభాతవార్త :** ప్రపంచ వాహన దినోత్సవం సందర్భంగా ప్రగతినగర్‌లోని వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఆటో హెరిటేజ్ ఫెస్ట్ 2025 పేరిట బుధవారం కార్యక్రమాలు జరిగాయి. 1886లో ఇదే రోజున ప్రపంచంలో మొదటి కారు కోసం కార్ల్ బెంజ్ అన్న వ్యక్తి పేటెంట్ సాధించిన గుర్తుగా ఏటా ఆటో హెరిటేజ్ ఫెస్ట్ జరుగుతుంది. తొలిసారిగా కళాశాలలోని ఆటో మొబైల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి తేజస్వి గ్రీన్ ఎనర్జీ సంస్థ వ్యవస్థాపక సంచాలకులు జతిల్ శర్మ ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా జతిల్‌శర్మ మాట్లాడుతూ, జపాన్, యూఎస్ఏ వంటి దేశాలు సాధిస్తున్న విజయాలు మనకు మార్గదర్శకం కావాలన్నారు. మారుతున్న సాంకేతికతకు, పర్యావరణ హిత పద్ధతులకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను సానబెట్టుకోవాలని చెబుతూ కృత్రిమ మేధ, బిగ్‌డేటా, ఐఓటీవంటి సాంకేతికల ద్వారా వాహనాలకు రానున్న ఇబ్బందులను ముందే గ్రహించి ఖర్చు, శ్రమ, అభద్రత నివారించ వచ్చని చెప్పారు. విజ్ఞానజ్యోతి సంస్థ ప్రధాన కార్యదర్శి కోడె దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఒకప్పుడు పెద్దగా అభివృద్ధి చెందని వాహనరంగం నేడు టివిఎస్ మహీంద్ర వంటి పరిశ్రమల ద్వారా ప్రపంచంలో వివిధ దేశాలకు వాహనాలను, విడిభాగాలను ఎగుమతి చేసేస్థాయికి చేరుకుందని, హ్యుందాయ్ వంటి సంస్థలు భారతదేశంలో విద్యుత్ వాహనాల తయారీ పరిశ్రమను నెల కొల్పాలని ముందుకు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాలలోని ఆటోమొబైల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య డా॥ ఫైక్ అమ్మద్, ప్రధా నాధ్యాపకులు ఆచార్య సి.డి.నాయుడు, ఆచార్య డా॥బి. చెన్నకేశవరావు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్విజ్, వక్తృత్వం, బ్లాగ్ రచన, చిత్రలేఖనం, పోస్టర్ ప్రదర్శనల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించ నున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**బేగంబజార్, జనవరి 29 ప్రభాతవార్త:** జియాగూడ 11 కెవి విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 గంటల 30 నిమి షాల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు బేగంబజార్ సిబిడి ఎడిఇ వెంకటేశ్వర్లు తెలిపారు. బంజావాడి, గిరికికాపల్లి, తొలి మజీద్, ఎస్‌బిఐ గార్డెన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. గంగానగర్ 11 కెవి విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా 10 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 1గంటల 30 నిమిషాల వరకు కమేలాగేట్, గంగానగర్ తదితర ప్రాంతాలల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. నల్లపోచమ్మ 11కెవి విద్యుత్ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా మధ్యాహ్నం 3గంటలనుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేసే ప్రాంతాలు ఇమామ్‌పురా, ఇందిరా నగర్, టప్పాచబుత్రా 11 కెవి విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా మెస్కామజీద్, లైన్ జిర్రా రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందన్నారు.

## బాబాసాహెబ్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను అరెస్ట్ చేయాలి

**జియాగూడ, జనవరి 29 ప్రభాతవార్త:** పంజాబ్ రాష్ట్రంలో భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగలను అరెస్ట్ చేయాలని తెలంగాణ రాష్ట్ర మహాత్మాజ్యోతిరావు పూలై మంచ్ అధ్యక్షులు కె.ఎం.గురుచరణ్, ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభాకర్, యువజన మంచ్ అధ్యక్షులు పి.మహేందర్ డిమాండ్‌చేశారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ అంబేద్కర్‌తోపాటు మహనీయులు విగ్రహాలను ధ్వంసం చేసిన వ్యక్తులకు కఠినశిక్షలు పడేవిధంగా కేంద్ర ప్రభుత్వంతోపాటు రాష్ట్రప్రభుత్వాలు ప్రత్యేక చట్ట తీసుకురావాలన్నారు. అంబేద్కర్ విగ్రహాలు ధ్వంసం చేయడం వెనుక కుట్రలు ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. పంజాబ్ రాష్ట్రంలో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన వ్యక్తంచేశారు.

## హుస్సేన్‌సాగర్ ఘటనలో బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

### మార్చురి వద్ద బంధువుల ఆందోళన

**సికింద్రాబాద్, జనవరి 29 ప్రభాతవార్త:**

హుస్సేన్‌సాగర్ ఘటనలో మృతిచెందిన అజయ్ కుటుంబ సభ్యులు సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి మార్చురి వద్ద ఆందోళన జరిపారు. మృతిచెందిన చిలువేరు అజయ్ కుటుంబ సభ్యులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని బందులువు డిమాండ్ చేశారు. మార్చురీలో అజయ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ క్రమంలో మార్చురీ వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు పెద్దయెత్తున పోగయ్యారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. వారు నిర్వహించిన ఆందోళనలో వారికి మద్దతుగా బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ మాట్లాడుతూ భారతమాత ఫౌండేషన్ మహాహారతి కార్యక్రమం సందర్భంగా జరిగిన దుర్ఘటనలో మృతి చెందిన, గాయపడ్డ వారిని ఇప్పటి వరకు ఒక్క మంత్రిగాని, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిగాని పరామర్శించలేదని అన్నారు. అజయ్ తండ్రి ఆటో నడుపుతూ కుమారుడిని విద్యావంతుడిని చేశారని, తండ్రికి అండగా ఉండాల్సిన తరుణంలో దుర్ఘటనలో ప్రాణాలు విడిచాడని అన్నారు. అధికార పార్టీ నేతలు కూడా ఇప్పటి వరకు బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తెలుపలేదన్నారు. వెంటనే ప్రభుత్వం వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

IN THE COURT OF THE HON'BLE Ist ADDL. CHIEF JUDGE CITY CIVIL COURT AT: SECUNDERABAD.
O.S.NO. 164 OF 2024

Between:
1.RoyyuruVijaya Lakshmi W/o Late.RoyyuruBhagiratha Sastry, Aged About-80 years, Occ-House Wife, R/o H.No.1-8-450/1/B-62, Patti Gadda, Street No.3, Behind Integraph, Secunderabad, Hyderabad, 500003.
2. Gabbita Rajyalakshmi W/o Gabbita Rajasekhar, D/o Late. Royyuru BhagirathaSastry, Aged About-53 years, Occ-Pvt Employee, R/o P.No.6-3-1099/1/9, Flat No.105, SrinilayaSagar View Apts, 1st Floor, Somajiguda, Hyderabad, 500082.
3. RoyyuruVenkataRamana Kumar S/o Late. Royyuru Bhagiratha Sastry, Aged About-51 years, Occ-Pvt Employee, R/o H.No.1-8-450/1/B-62, Patti Gadda, Street No.3, Behind Integraph, Secunderabad, Hyderabad, 500003.
.... Plaintiffs

AND

1. Deputy Commissioner of the GHMC Secunderabad.
2. The Tahsildar, Secunderabad, Telangana, 501359.
3. All Concerned.
...Defendants

PUBLIC NOTICE

Plaintiffs No. 1 to 3 have filed a suit seeking the declaration of legal heirs of the late RoyyuruBhagirathaSastry, who passed away intestate on 14/09/2016. The suit was filed before the Court of Hon'ble Ist Addl. Chief Civil Judge at Secunderabad. Pursuant to the directions of this Hon'ble Court, this public notice is hereby issued.
The general public is informed that any person(s) having any objections or claims regarding the declaration of legal heirs should appear and file the same before the Hon'ble Court on 17/02/2025 at 10:30 a.m., either through counsel or in person. If no objections or claims are received by the specified date and time, the matter will be decided based on its merits.

(BY ORDER OF THE COURT)
Mukesh Agarwal,
M/S. AGARWAL LEGAL SOLUTIONS
H.No. Lig-B-86 Dr.As.Rao Nagar, ECIL 500062. Ph: 9100411204.

IN THE COURT OF THE HON'BLE I ADDL JUNIOR CIVIL JUDGE CUM VII ADDl JUDICIAL MAGISTRATE OF FIRST CLASS RANGA REDDY DISTRICT ATHAYATHNAGAR.
O.S NO: 44 OF 2025

BETWEEN:
Gayathri Devi Gorantla & 2 others
..PLAINTIFFS
AND
Rajeswari Gorantla & Others
..DEFENDANTS

To,
D)2 Chiranjeeviakhil Surendrakumar Gorantla,S/o. Late Surendra Kumar Hanumantha Rao Gorantla,Age: 25 years, Occ.: Private Service,R/o. Flat No.003, Sunder CHS, Plot No.23,Near Fire Brigade Sector No.3 E Navi Mumbai, Kalamboli Node, Panvel Raigarh, Maharashtra - 410218 Presently residing at H.No.3901, 1st Floor,New MIG BHEL, Patancheru - 502 032, T.S.

The general public is hereby informed that the plaintiffs herein have filed the above O.S No: 44 of 2025 to declare them as the legal heirs of Late Surendera Kumar Hanumantha Rao Gorantla.The said case is posted on 11/2/2025 at 10.30 am before the above Hon'blecourt . That if any person/s or institution/s have any claim or objection in the above case, he/she/they may make appearance before the Hon'ble court with the objection/s if any, along documentary evidence in proof of their claim.

(By order of the Hon'ble Court)
N.HARI PRASAD
Advocate
H.No.3-5-926/B/1,
Himayath Nagar, Hyderabad.

## త్వరగా అభివృద్ధి పనులు చేపట్టాలి : లచ్చిరెడ్డి


సి.సి. రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం. జనవరి.29.ప్రభాతవార్త.
బి.ఎన్. రెడ్డి.నగర్ డివిజన్ లోని ఎస్. జి.ఓ. కాలనీలో జరుగుతున్న సి.సి.రోడ్డు నిర్మాణపు పనులను బి.ఎన్. రెడ్డి.నగర్. డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులలో నాణ్యత పాటించాలన్నారు.కాలనీవాసుల కు ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలని కోరారు. దశల వారిగా డివిజన్ పరిధిలోని కాలనీలలో అభివృద్ధి పనులు చేపడతామన్నారు.ప్రజలకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే సమస్య పరిస్కారానికి కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఏ.ఈ. రాజ్ కుమార్,జిల్లా అధికార ప్రతినిధి శరత్ కుమార్, సీనియర్ నాయకులు శ్రీధర్ రావు,సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

### అఖిలాండేశ్వరి నగర్ నూతన కమిటీ ఏర్పాటు

**వనస్థలిపురం జనవరి.29, ప్రభాతవార్త :** బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ లోని అఖిలాండేశ్వరి నగర్ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏర్పాటైంది. అధ్యక్షుడు గా వి. సోమేశ్వర రావు,ప్రధాన కార్యదర్శి గా సి. బి.ఎస్. రాజు,కోశాధికారి గా కె.వి.ఎస్. శేఖర్, ఉపాధ్యక్షుడు గా కె.గణేష్,ఆర్గనైజింగ్ సెక్రెటరీ గా జి.శారద, కమిటీ సభ్యులు గా సీఎచ్. వి. మీనాక్షి, ఎమ్.డి.రఫి, పి.వి.ఎస్. ఆనంద రావు, ఎస్. శ్రీకాంత్,ఎస్. శాంత రాజు, గౌరవాధ్యక్షుడు గా ఎం. నాగేశ్వరరావు, సలహాదారుగా ఏ.పి.ఆర్.విట్టల్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాలనీ అభివృద్ధి కి కృషి చేస్తామని నూతన కమిటీ తెలిపింది. తమ నియామకానికి సహ కరించిన కాలనీ వాసుల కు కృతజ్ఞతలు తెలిపారు.

## క్రీడలతో చక్కటి ఆరోగ్యం : సీఈఓ చైతన్య


పోటీలను ప్రారంభిస్తున్న సీఈవో చైతన్య, జోనల్ ఇంచార్జ్ అంకమ్మరావు, ప్రిన్సిపాల్ పల్లవి తదితరులు

**మలక్ పేట జనవరి 29, ప్రభాతవార్త:** క్రీడలతో చక్కటి ఆరోగ్యం చేకూరుతుందని భాష్యం హై స్కూల్ సీఈఓ చైతన్య, జోనల్ ఇంచార్జ్ అంకమ్మరావు, దిల్ షుక్ నగర్ భాష్యం హై స్కూల్ ప్రిన్సిపల్ పల్లవిలు పేర్కొన్నారు. దిల్ షుక్ నగర్ భాష్యం హై స్కూల్ గ్రౌండ్ లో జరిగిన భాష్యం విద్యాసంస్థల జోన్ 3 బ్రాంచ్ ల ఇంట్రా జోన్ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కబడ్డీ, కోకో, వాలీబాల్ ,త్రో బాల్, టెన్నికాయిట్, షటిల్, రన్నింగ్ తదితర క్రీడలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారని తెలిపారు. విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడంతోపాటు క్రీడలలో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. అదేవిధంగా అన్ని అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. క్రీడా పోటీలలో దిల్ షుక్ నగర్ భాష్యం హైస్కూల్ కు చెందిన విద్యార్థులు కబడ్డీ, షటిల్, రన్నింగ్ పోటీలలో విజయాన్ని సాధించరని దిల్ షుక్ నగర్ పాఠశాల ప్రిన్సిపాల్ పల్లవి తెలిపారు. క్రీడా పోటీలలో గెలుపొందిన వారికి వారు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్ లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### చంపాపేటలో కేంద్రమంత్రి బండి సంజయ్ దిష్టి బొమ్మ దగ్ధం



**సైదాబాద్, జనవరి 29 ప్రభాతవార్త:** ప్రజాయుద్ద నౌక గద్దర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యాలను నిరసిస్తూ ఎన్ఎస్‌యుఐ నాయకులు రోహిత్ కుమార్ ఆధ్వర్యంలో చంపాపేట చౌరస్తాలో ఆయన దిష్టిబొమ్మను దగ్దం చేశారు. తెలంగాణా ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించడమే గాకుండా తన జీవితాంతం దీనజనోద్దరణ, బహుజనుల కోసమే గద్దర్ పోరాటం చేయడం జరిగిందన్నారు. అలాంటి వ్యక్తిపై కేంద్రమంత్రి స్థానంలో ఉన్న బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యాలు చేయడం సరికాదన్నారు. తెలంగాణా ప్రజలకు వెంటనే కేంద్ర మంత్రి క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతగింజ రంజిత్, గూడూరు గౌతంరెడ్డి, వినీత్ రెడ్డి, యాదగిరి, జక్కా సందీప్, నితీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అమావాస్య సందర్భంగా చంపాపేటలో అన్నదానం


అన్నదానం చేస్తున్న కమిటీ చైర్మన్ భగవాన్, రవి ముదిరాజ్

**సైదాబాద్, జనవరి 29 ప్రభాతవార్త:** అన్ని దానాల్లో కెల్ల అన్నదానం గొప్పదని శ్రీ మాత అన్నపూర్ణేశ్వరి అన్న ప్రసాద వితరణ కమిటీ చైర్మన్ భగవాన్ అన్నారు. అమావాస్య సందర్భంగా బుధవారం చంపాపేటలోని పోచమ్మ దేవాలయాల సమీపంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ భగవాన్ మాట్లాడుతూ గత 21 మాసాలుగా ప్రతి అమావాస్య నాడు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బినగర్ బిఆర్ఎస్ యూత్‌వింగ్ అధ్యక్షుడు రవి ముదిరాజ్, సుశీల్ కుమార్, సంతోష్ లడ్డ, ఘనసాల వెంకటేష్, ఆడెల్ల రాజు, అందేకార్ వెంకటేష్ టింగ్లికార్ రాజేష్, షానవాజ్ హుస్సేని తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ బిల్ చెల్లించాలని అడిగినందుకు లైన్ మాన్ పై దాడి

**మల్కాజిగిరి జనవరి29, ప్రభాతవార్త :** కరెంట్ బిల్ చెల్లించాలని అడిగినందుకు మోలాలి సెక్షన్ ఆఫీసులో పనిచేస్తున్న సురేష్ అనే లైన్మెన్ పై ఇర్ఫాన్ అనే వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మోలాలి డివిజన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో చోటుచేసుకుంది , గతంలో కూడా మోలాలి లో ఇలాంటి సంఘటన చోటు చేసుకుంది. విద్యుత్ అధికారుల ఫిర్యాదు మేరకు మల్కాజిగిరి పోలీసులు కేసు నమోదు చేసారు.

## బండి సంజయ్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి


బండి సంజయ్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

వనస్థలిపురం జనవరి.29.ప్రభాతవార్త
యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆదేశాల మేరకు ఎల్.బి నగర్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కె. శివ కుమార్.. ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని ఇందిరాగాంధి ,మరియు తెలంగాణ పాటల గొంతుక ప్రజా నౌక గద్దర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను సాగర్ జాతీయ రహదారి అంబేద్కర్ విగ్రహం వద్ద పై మంగళవారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మాజీ ప్రధాని ఇంద్ర గాంధీ పై మరియు ప్రజా నౌక గద్దర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని బేషరతుగా యావత్ తెలంగాణ ప్రజానీకానికి క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో బండి సంజయ్ ని తెలంగాణ ప్రజానికం క్షమించదని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో హస్తినపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దెంది.శశిధర్ రెడ్డి.యువజన కాంగ్రెస్ , ఎస్ ఎస్ ఎస్, కోఆర్డినేటర్ విద్యా రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు సాయి నికేష్. ఎల్బీనగర్ నియోజకవర్గం ఉపాధ్యక్షులు సాయిరాం రెడ్డి సామలేటి సాయి, ప్రధాన కార్యదర్శులు దాడి రుత్విక్ రెడ్డి,మన్నె రాము యాదవ్,దాసు మనోజ్ , దుర్గేష్, పలు డివిజన్ల అధ్యక్షులు రమణ రెడ్డి శ్రీనివాస్ మధు గౌడ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,బ్రహ్మ రెడ్డి,మధు,బ్రహ్మ చారి,యువజన కాంగ్రెస్ నాయకులుపగిడిమర్రి.భార్గవ్ రాము గౌడ్ సాయి కృష్ణ వైద్యం రాజు కొమ్ము శివ యాదవ్ , మరియు పెద్ద ఎత్తున యువజన కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు..

## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసిన ఎమ్మెల్యే మర్రి



మల్కాజిగిరి జనవరి29,ప్రభాతవార్త :
మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రామ యాదవ్ తో కలిసి బుధవారం చిన్మయ మార్గం కాలనీవాసులు హైడ్రా కమిషనర్ రంగనాథులు కలిశారు. ఇటీవల మీరు మిర్జాగూడ చిన్మయి మార్గ్ అసోసియేషన్ ప్రతినిధులు 66 ఫీట్ల మాస్టర్ ప్లాన్ ఉందని దానికి అనుగుణంగా రోడ్డు ఆక్రమణలకు పాల్పడ్డ ఇళ్లను కూల్చివేయాలని హైడ్రా ను ఆశ్రయించారు. స్పందించిన హైడ్రా బృందం కొద్ది రోజుల క్రితం చిన్మయి మార్గ్ కు వచ్చి రోడ్డు ఆక్రమణలకు గురైన ఇళ్లను గుర్తించి మార్కింగ్ చేసి వెళ్లారు. దీంతో బాధితులు బుధవారం మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మరియు స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రామ్ యాదవ్ లతో కలిసి హైడ్రా కమిషనర్ ను కలిశారు. పాము దశాబ్ద కాలం నుంచి ఇల్లు నిర్మించుకొని చిన్మయి మార్గ్ ప్రాంతంలో నివాసముంటున్నామన్నారు ముమ్మాటికి 66 ఫీట్ల రోడ్డు లేదని స్పష్టంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు తెలిపారు. సానుకూలంగా స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ త్వరలో సమావేశం ఏర్పాటు చేసి వాస్తవాలు తెలుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాము యాదవ్ చిన్మై మార్గ్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేకే బిఆర్ఎస్ అసత్యప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణా ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్

**సైదాబాద్,జనవరి 29 ప్రభాతవార్త:** రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేకనే బిఆర్ ఎస్ నాయకులు కడుపు మంటతో అసత్య ప్రచారాలకు పూ నుకుంటున్నారని తెలంగాణా ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ అన్నారు. చంపాపేటలోని రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయభూమిలేని కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా రూ.12వేలు ఇస్తున్న ఘనత ప్రజా ప్రభుత్వానికే దక్కిందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం అవినీతితో కుంగిపోయిందని, బిఆర్ఎస్ నాయకులు ప్రజాధనాన్ని బడాబాబులకు దోచిపె ట్టారని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం గత పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, పేపర్ల లీకేజిలతో నిరుద్యోగులను రోడ్డున పడేశారని, రుణమాఫీ చేయకుండా రైతులను మో సం చేశారని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ఏడాది లోనే ఒకేసారి రూ.2లక్షల లోపు రుణమాఫీ చేసిందని, ఒక్క ఏడాదిలోనే 55,143 ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తుంటే, రైతు భరోసాను రూ.12 వేలకు పెంచితే బిఆర్ఎస్ నాయకులకు కడుపు మంటగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటన ద్వారా రూ.1.78లక్షల కోట్ల పెట్టుబడులు తెలం గాణాకు వస్తే బిఆర్ఎస్ నాయకులు తట్టుకోలేకే ప్రభుత్వంపై అసత్య ప్రచారాలకు పూనుకుంటున్నారని ఆయన విమ ర్శించారు. ఈ కార్యక్రమంలో దయాకర్, రమాకాంత్, బం డి సురేందర్, అఫ్రోజ్, మనోజ్ సింగ్ పాల్గొన్నారు.

## వేసవిలో డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా : సిఇ కామేష్



సమీక్ష సమావేశంలో ప్రసంగిస్తున్న నోడల్ అధికారి ఎ.కామేష్, ఎస్ఇ ఎం.రవికుమార్, పి.బ్రహ్మం తదితరులు

**ఉప్పల్, జనవరి 29 ప్రభాతవార్త :** రానున్న వేసవిలో పెరిగే డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ మేడ్చల్ జిల్లా నోడల్ అధికారి, సిఇ ఎ.కామేష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్‌లోని ఎస్ఇ కార్యాలయంలో వేసవి కాలం కార్యచరణ ప్రణాళికపై మేడ్చల్ ఎస్ఇ ఎం.రవికుమార్, హబ్సిగూడ ఎస్ఇ పి.బ్రహ్మం, ఎస్ఇ జి.లక్ష్మన్‌రాజ్ తదితరులతో కలిసి విద్యుత్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిఇ కామేష్ మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ సరఫరా తీరుతెన్నులను నిరంతరం పర్యవేక్షించడంతోపాటు, ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు గ్రేటర్ పరిధిలోని ప్రజలు 1912 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. విద్యుత్ అంతరాయంతోపాటు, అన్ని సమస్యలు తెలియజేయవచ్చని తెలిపారు. బౌరంపేటలో రూ.200 కోట్లతో 132 కెవి సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నామని, ఫిబ్రవరి చివరినాటికి దీనిని ప్రారంభిస్తామని తెలిపారు. రూ.37.83 కోట్లతో షాపూర్‌నగర్, మేడిపల్లి, బోడుప్పల్, ఉప్పల్ భగాయత్‌లలో కొత్త సబ్‌స్టేషన్లు నిర్మిస్తున్నామని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే మరో మార్గం ద్వారా విద్యుత్ సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లాలలో 33 కెవి పీడర్లు 134 ఉన్నాయని, 121 సబ్‌స్టేషన్లు, 262 పిటిఆర్‌లు, 1436 బ్రేకర్లు, 11 కెవి పీడర్లు 848, పబ్లిక్ డిటిఆర్‌లు 11875 ఉన్నాయని తెలిపారు. 90 శాతం పనులు పూర్తి చేశామని, త్వరలోనే అన్ని పనులు పూర్తి చేస్తామని తెలిపారు. వేసవిలో విద్యుత్ సమస్యలు లేకుండా ఉండేందుకు రూ.540 కోట్లతో ప్రణాళికలు రూపొందించామని, రూ.374 కోట్లు మేడ్చల్ జిల్లాకు, రూ.145 కోట్లు హబ్సిగూడ సర్కిల్‌కు కేటాయించినట్లు తెలిపారు. జిల్లాలో 1050 మెగావాట్ల డిమాండ్ ఉందని, 1400 వరకు డిమాండ్ వచ్చినా తట్టుకునే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడిన సమయంలో 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా ప్రత్యేక సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ఉప్పల్ డిగ్రీ కళాశాలకు స్థలం మంజూరు : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


డిగ్రీ కళాశాల మంజూరు వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ తదితరులు

**ఉప్పల్, జనవరి 29 ప్రభాతవార్త :** ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రభుత్వం నుంచి స్థలం మంజూరు చేయించినట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఉప్పల్ డిఎస్ఎల్ మాల్ వద్ద ఉన్న ప్రభుత్వ భూమి సర్వేనెం. 581/1లో సుమారు రెండు ఎకరాల స్థలం కేటాయించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర మంత్రి డి.శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవ తీసుకుని స్థలం కేటాయించారని, ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న కళాశాలను త్వరలోనే కొత్త భవనం నిర్మించి అక్కడికి తరలిస్తామని తెలిపారు. సొంత భవనం లేక డిగ్రీ కళాశాల విద్యార్థులు అవస్థలు పడ్డారని, దీనిని దృష్టిలో ఉంచుకుని స్థలం కేటాయించినట్లు తెలిపారు. కళాశాల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి కళాశాల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. విజయ్‌కుమార్, డా.రవిప్రసాద్, డా.తిరుపతి, గీత, బిఆర్ఎస్ నేతలు గంధం నాగేశ్వర్‌రావు, అన్య బాలకృష్ణ, మహేష్‌గౌడ్, నవీన్‌గౌడ్, జెట్ట కిషోర్, సుక్క కిరణ్; ఇంద్రయ్య, బింగి భరత్, కడిగె శేఖర్, రాజు, ఐలేష్, మహేందర్, శ్రీనివాసాచారి, ప్రభాకర్, యుగేందర్‌రెడ్డి, రోశయ్య, మనీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## దళిత ఉప కులాలకు అండగా ఉంటా - పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ


సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

మన్సూరాబాద్ ,జనవరి 29, ప్రభాతవార్త :
రిజర్వేషన్లలో అందరి వాటాన్ని దోచుకున్న మాలలను ఎస్సీల నుండి తొలగించి అట్టి రిజర్వేషన్లను ఉప కులాలకు అందించాలని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు . ఎల్బీనగర్ లో సితార హోటల్ లో జరిగిన ఎస్సీ వర్గీకరణ పై మాదిగ ఉప కులాలరౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మంద కృష్ణ మాట్లాడుతూ ...బాబాసాహెబ్ అంబేద్కర్ సాధించి పెట్టిన రిజర్వేషన్ ఫలాలను రాజ్యాంగం అమల్లోకి వచ్చిన కానుండి, రిజర్వేషన్లు అమల్లోకి వచ్చిన కానుండి ఈనాటి వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో కానీ ప్రస్తుతం తెలంగాణ ఆంధ్రప్రదేశ్లో కానీ రిజర్వేషన్ల కంటే మించి రిజర్వేషన్లు పొందింది మాలలు మాత్రమేనని స్పష్టం చేశారు. మాదిగ ఉప కులాలను కాపాడుతామని అదే విధంగా వర్గీకరణ పై దుష్ప్రచారం చేస్తున్న వారిని అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ , ఉప కులాల ఆధ్యక్షులు తూర్పాటి హనుమంత్ , చింతల రాజలింగం , డాక్టర్ రాజమోళి , కొడిగంటి నర్సింహా , బోనాల మంగేష్ , తూర్పాటి కృష్ణ పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి పేదలకు వరం


లబ్దిదారులకు సిఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, జనవరి 29 ప్రభాతవార్త :** సిఎం సహాయనిధి నిరుపేదలకు ఒక వరంలాంటిదని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం సిఎం సహాయనిధి కింద పేదలకు మంజూరైన చెక్‌లను అందజేశారు. ఈ సందర్భంగా వంగపల్లి అభిలాష్‌కు రూ.60 వేలు, రవిశంకర్‌కు రూ.60వేలు, నిశితకు రూ.60వేల చెక్‌లు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అండగా ఉంటుందని, అనారోగ్యంతో బాధపడుతున్న పేదలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హులందరికి చేయూత అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అకారపు అరుణ్‌కుమార్, గడ్డం యాదగిరి, నెమలి అనిల్, ఉదయ్‌కిరణ్, ప్రశాంత్‌రెడ్డి, అమర్, సత్యం, రాఘవేంద్ర, రఘు, కిషోర్ పాల్గొన్నారు.

### డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించండి : శ్రీవాణి


జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు

**రామంతాపూర్, జనవరి 29 ప్రభాతవార్త :** రామంతాపూర్ భగాయత్ కాలనీ అభివృద్దికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయాలని స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి బుధవారం జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రామంతాపూర్ భగాయత్‌లోని బాలకృష్ణనగర్, కెసిఆర్‌నగర్‌లో సిసి రోడ్లు, డ్రైనేజీ సదుపాయాలు కల్పించాలని, అంబేడ్కర్ విగ్రహానికి ప్రభుత్వం నుంచి జయంతి, వర్ధంతి కార్యక్రమాలకు అలంకరణ చేయాలని కోరారు. దీనిపై జోనల్ కమిషన్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ నేతలు కె.స్వామి, నగేష్, జి.స్వామి, నాగరాజు, రాంచందర్, రాములు పాల్గొన్నారు.

### శ్రీ అభయాంజనేయస్వామి ఆలయం హుండీ లెక్కింపు


శ్రీ అభయాంజనేయస్వామి హుండీ లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

**ఉప్పల్, జనవరి 29 ప్రభాతవార్త :** ఉప్పల్ ఎన్‌జిఆర్ఐ వద్ద ఉన్న శ్రీ అభయాంజనేయస్వామి ఆలయం హుండీ బుధవారం లెక్కించారు. దేవాదాయశాఖ అధికారి ప్రణీత్‌కుమార్, ఆలయ కార్యనిర్వహణ అధికారి వెంకన్న, ఆలయ కమిటి ఫౌండర్ మెంబర్లు కట్టా నాగయ్య, నరసింహా, లక్ష్మినారాయణ, వెంకట్‌రెడ్డి, అంజయ్య, ఆలయ కమిటి మెంబర్లు దేవిరెడ్డి, వర్కల మదన్‌గౌడ్, ధర్మనాయక్, అమరేశ్వరి, రాజేశ్వరి, రాఘవేంద్ర, అంజయ్యగుప్త, ఈగ అంజయ్య, లక్ష్మారెడ్డి, రఘునాద్ రెడ్డి, ఆలయ పండితులు రవీంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు. బుధవారం జరిగిన లెక్కింపులో రూ.3, 35,746 వచ్చినట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి భక్తులు సహకరించాలని కోరారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి హుండీ లెక్కిస్తామని తెలిపారు. రెండున్నర నెలలకు రూ.3.35లక్షలు వచ్చినట్లు తెలిపారు.

### ప్రజా సౌకర్యార్థం రోడ్డు పునరుద్ధరణ


రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్లు నర్సింహారెడ్డి, నవజీవన్‌రెడ్డి

**హయత్‌నగర్, జనవరి 19 ప్రభాతవార్త:** ఇరవై ఏళ్ల క్రితం ఏర్పాటు చేసుకున్న రోడ్డును మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పునరుద్దరణ చేశారు. 2006లో వినాయక్‌నగర్ కాలనీవాసులు శర్మ ఆధర్యంలో వివిద కాలనీవాసులు జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేసుకుని గుర్రం బాల్‌రెడ్డి అధ్యక్షతన ఆర్టీసీ కాలనీ రోడ్డు నెంబరు 5 నుంచి ఆర్టీసీ సూపర్‌వైజర్స్ కాలనీ మీదుగా జాతీయ రహదారికి సులభంగా వెళ్లేలా రోడ్డును ఏర్పాటు చేసుకున్నారు. అప్పట్లో ప్రభుత్వ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్‌ను కలిసి ప్రజా అవసరాల నిమిత్తం డ్రైనేజీ, రాకపోకల కోసం రోడ్డును ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. బొమ్మలగుడి నుంచి రాకపోకలు సాగించే వారితో పాటు ఇతర కాలనీవాసుల సౌకర్యార్థం ఏరా ్పటు చేసిన రోడ్డు పునరుద్దరణ కోసం సహకరించిన వినాయక్‌నగర్ కాలనీ సంక్షేమసంఘం సభ్యులకు కార్పొరేటర్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు సీతరామశర్మ, గుర్రం బాల్‌రెడ్డి, కళ్లెం రవీందర్‌రెడ్డి, కళ్లెం శంకర్‌రెడ్డి, జట్ట మహేష్, కొండల్ రెడ్డి, యాదగిరి,లక్ష్మణ్ పాల్గొన్నారు.

### జి4ఎస్ తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ

మల్కాజిగిరి జనవరి29, ప్రభాతవార్త :
మల్కాజిగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జి4ఎస్ తెలంగాణ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు క్యాలెండర్‌ను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తన రాజకీయ జీవితంలో కార్మికులతో గొప్ప అనుబంధం ఉన్నదని, కార్మికుల పక్షాన తను చేసిన నిస్వార్థ పోరాటాన్ని గుర్తించి పెద్దలు కే.సి.ఆర్ తనకు మల్కాజిగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీచేసే అవకాశం కల్పించారని. కార్మికుల పక్షాన నిలబడి వారికి వెన్నుదన్నుగా ఉండేందుకు కృషి చేస్తానని, తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం కోసం చొరవ చూపిస్తానని అన్నారు.కార్యక్రమంలో జి4 ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పి.నారాయణ, ప్రధాన కార్యదర్శి మారుతి ప్రసాద్, పి.శ్రీనివాస్, రవికుమార్, నరసింహ, రామకృష్ణ రావు, రాజేశం, పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి లాంగడి పోటీలకు రాజశ్రీ విద్యామందిర్ విద్యార్థి ఎంపిక

**హయత్‌నగర్, జనవరి 29 ప్రభాతవార్త:**
పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కేంద్రంలోని రాజశ్రీ విద్యా మందిర్‌లో 8వ తరగతి చదువుతున్న కె.నిహాంత్‌రెడ్డి జాతీయ స్థాయి లాంగడి పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల రవీస్ బ్రిలియంట్ పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి లాంగడి పోటీలో చక్కటి ప్రతిభ కనబర్చిన నిహాంత్‌ను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నిహాంత్‌రెడ్డిని రాజశ్రీ పాఠశాల కరస్పాండెంట్ జగన్మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 2 వరకు తమిళనాడులో జరిగే 14వ జాతీయస్థాయి సబ్‌జూనియర్ పోటీలలో నిహాంత్‌రెడ్డి పాల్గొంటారని కోచ్ నీలేష్ తెలిపారు.

### వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ట్రస్ట్ అన్నదానం


అన్నదానం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

**సరూర్‌నగర్, జనవరి 29 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని జిల్లెలగూడ దీన్‌దయాళ్‌నగర్ ఆర్‌సిఐ రోడ్డులోని నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కన నిర్మాణంలో ఉన్న శ్రీశ్రీశ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో బుధవారం మౌనీ అమావాస్య సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ట్రస్ట్ ఆధ్వర్యంలో వాసవీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రజలకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ తేరేటిపల్లి శ్రీనివాస్‌గుప్త, అధ్యక్షుడు పచ్చిపులుసు శ్రీరామచంద్రమూర్తి గుప్త, ఇరువెంటి సురేష్‌గుప్త, గందె వెంకటేశ్‌గుప్త, బాలాపూర్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నాళ్ళ శ్రీనివాస్‌గుప్త, యూత్ వింగ్ అధ్యక్షుడు బొగ్గారపు ఆంజనేయులుతో పాటు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### 31న వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం

ఈ నెల 31వ తేదీ శుక్రవారం వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తేరేటిపల్లి శ్రీనివాస్‌గుప్త, పచ్చి పులుసు శ్రీరామచంద్రమూర్తి గుప్తలు తెలిపారు. నిర్మాణంలో ఉన్న అమ్మవారి దేవాలయంలో కార్యక్రమం జరుగుతుందనీ ఇందులో భాగంగా వాసవీమాతకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, మహిళలతో కుంకుమార్చనలు జరుగుతాయని వారు వివరించారు. ఈ మేరకు వాసవీ మాత భక్తులు, ఆర్యవైశ్య కుటుంబాల వారు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు.

### నేషనల్ స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌కు లార్డ్స్ విద్యార్థి ఎంపిక



పోటీలకు ఎంపికైన అక్కి ఆశితను సన్మానిస్తున్న లార్డ్స్ ఛైర్మన్ బీరప్ప

**సరూర్‌నగర్, జనవరి 29 ప్రభాతవార్త:** ప్రతిష్టాత్మక నేషనల్ స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌కు సంబంధించి అండర్ 17 జాతీయ బృందానికి ఎంపికైన జిల్లెలగూడ లార్డ్స్ హై స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని అక్కి ఆశితను లార్డ్స్ గ్రూప్ విద్యా సంస్థల ఛైర్మన్ సిద్దాల బీరప్ప అభినందించి సన్మా నించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఆశితతో పాటు బాలిక తండ్రి అక్కి ఈశ్వర్ గౌడ్‌ను కూడా సన్మా నించి అభినందించారు. పట్టుదలతో శ్రమించి నిరంతర ప్రాక్టీస్ చేయడం వల్ల ఆశితకు నేషనల్ స్కూల్ ఫెడరేషన్ క్రీడా పోటీలకు ఎంపికైందని అన్నారు. బాలికను ప్రోత్స హించిన తండ్రి ఈశ్వర్ స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లార్డ్స్ గ్రూపు స్కూల్స్ డీన్ సతీష్, జిల్లెలగూడ ప్రిన్సిపాల్ మరియన్ తదితరులు పాల్గొన్నారు.

## కలుషిత ఆహారం తిని విద్యార్థులకు అస్వస్థత

న-ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన.. కోలుకున్న విద్యార్థులు


విద్యార్థులతో కలిసి హాస్టల్ పరిసరాలను పరిశీలిస్తున్న కేతావత్ బహుగుణ తదితరులు

**సరూర్‌నగర్, జనవరి 29 ప్రభాతవార్త:** బాలాపూర్ మండలంలోని నాదర్‌గుల్‌లోనున్న కందుకూరు గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం భుజించి పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 26వ తేదీన గణతంత్ర దినోత్సవ వేడుకల సంద ర్భంగా విద్యార్థులకు భోజనంతో పాటు మిఠాయిలు కూడా వడ్డించారు. దీంతో పలువురు విద్యార్థులు వాంతులు, విరోచనాలతో అస్వస్థతకు గురికాగా ప్రిన్సిపాల్ హాస్టల్‌లోనే నర్సుతో వైద్యం చేయించగా కోలుకున్నారు. అయితే ఓ విద్యార్థికి మాత్రం పరిస్థితి బాగా లేకపోవడంతో వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఆ బాలుడు కూడా కోలుకున్నా డు. అయితే హాస్టల్‌లో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వ స్థతకు గురయ్యారని తెలుసుకున్న తల్లిదండ్రులు ఆందోళనకు గురై హాస్టల్‌కు వచ్చి తమ పిల్లల యోగక్షేమాలను తెలు సుకున్నారు.

### సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలి : బిఎస్‌పి

కాగా హాస్టల్‌లో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారనే విషయంపై స్పందించిన బిఎస్‌పి నాయకులు బుధవారం నాదర్‌గుల్‌కు వచ్చి హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పరామర్శించి హాస్టల్‌తో పాటు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ కలుషిత ఆహారం సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ బిఎస్‌పి అధ్యక్షుడు కేతావత్ బహుగుణ నాయక్, జిల్లా కార్యదర్శి నితిన్ కిశోర్, శ్రీకాంత్, పల్లె కిరణ్‌కుమార్, అఖిల్, పవన్, సాయితేజ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదాలపై వాహనదారులకు అవగాహన

**ఉప్పల్, జనవరి 29 ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదాలపై వాహనదారులకు అవగాహన కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని ఉప్పల్ ట్రాఫిక్ సిఐ లక్ష్మి మాధవి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ చౌరస్తాలో క్యాబ్ డ్రైవర్లు, ఇతర వాహనదారులకు ఎస్ఐ చిరంజీవి, మాధవరెడ్డి, ఎస్ఐ రమేష్, ఆర్ఎస్ఐ నరేష్ తదితరులతో కలిసి వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ప్రజలకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. చర్యలు సుకుంటామని తెలిపారు. ప్రతి ఒక్కరు సీటు బెల్ట్ ధరించాలని, వాహనదారులు నిబంధనలు పాటించాలని సూచించారు.